VASANTH KUMAR
Director
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K. U.S.A., New Zealand)
QUALITY SERVICE SINCE 1997
AAERI MEMBER
QEAC No. E334
: 1-10-3, Ashok Nagar, Hyderabad-20, INDIA
: 91(40) 27628184, 27674037
: victoria.ashoknagar@gmail.com
: //www.victoriaoverseas.com

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 68, పేజీలు - 08
సోమవారం, ఆగష్టు 11, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

Host On Your Domain
Hosting / Admin Panel
Page Builder / Social Links
Responsive Design
Advertisement Spaces
Search Engine Optimization
XML Sitemap
Automatic Software Updates
Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

## ఆనాడు సాయం.. నేడు ప్రయోగం

**- అమెరికా శాటిలైట్‌తో ఇస్రో సరికొత్త చరిత్ర**



**బెంగుళూరు (ప్రశ్న న్యూస్)** ఒకప్పుడు చిన్న రాకెట్ కోసం అగ్రరాజ్యం అమెరికా వైపు చూసిన భారత్, ఇప్పుడు అదే అమెరికాకు చెందిన భారీ ఉపగ్రహాన్ని తన సొంత గడ్డపై నుంచి నింగిలోకి పంపే స్థాయికి ఎదిగింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) త్వరలో ఈ చరిత్రాత్మక ప్రయోగానికి సిద్ధమవుతోంది.

2లో..

## 'ఓట్ చోరీ' వెబ్ సైట్ ఆవిష్కరించిన రాహుల్ గాంధీ

**- డిజిటల్ ఓటర్ల జాబితా విడుదల చేయాలని డిమాండ్**





**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) లక్ష్యంగా తన విమర్శల దాడిని మరింత తీవ్రతరం చేశారు. డిజిటల్ ఓటర్ల జాబితాను విడుదల చేయాలన్న తన డిమాండ్‌కు ప్రజల మద్దతు కూడగట్టేందుకు 'ఓట్ చోరీ' పేరుతో ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. దేశంలో ఓట్ల దొంగతనం జరుగుతోందని,

2లో..

## ట్రంప్‌పై విరుచుకుపడిన రాజ్‌నాథ్ సింగ్

**- భారత్ అభివృద్ధిని జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శలు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత వస్తువులపై 25 శాతం సుంకం విధించిన నేపథ్యంలో, కొన్ని దేశాలు భారత ఆర్థిక పురోగతిని అసూయతో చూస్తూ, దాన్ని అడ్డుకోవడానికి

2లో..

# సీఎం రేవంత్ రెడ్డి ఆకస్మిక పర్యటన

**- అమీర్‌పేట్ గంగుబాయి బస్తీ, బుద్ధ నగర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన**

**- స్థానికులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి**

**- సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు**

**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ యంత్రాంగం సూచన**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారీ వర్షాల సమయంలో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలు, కాలనీల ప్రజలు వరద నీటితో ఇబ్బంది పడుతున్నారు. మైత్రీవనం ప్రాంతాల్లో, బల్కంపేట ప్రాంతంలోని బుద్ధనగర్, గంగుబాయి బస్తీల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అమీర్‌పేట బుద్ధ నగర్ లో జశ్వంత్ అనే ఓ బాలుడు సీఎం రేవంత్ రెడ్డికి తమ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న వరద సమస్యలను వివరించి శభాష్ అనిపించుకున్నాడు. భారీ వర్షాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన కార్యచరణపై అధికారులకు రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు.

**- పుస్తకాలు తడిచిపోయాయని సీఎంకు చెప్పిన బాలుడు**

7వ తరగతి చదువుతున్న బాలుడు జశ్వంత్ సీఎం రేవంత్ రెడ్డికి స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను వివరించాడు. జశ్వంత్ భుజంపై చేతులు వేసి ఓ స్నేహితుడిగా కాలనీలో తిరుగుతూ కాలనీ వాసుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి బాలుడ్ని అడిగి తెలుసుకున్నారు. వరద నీరు ఇంట్లోకి రావడంతో తన పుస్తకాలు మొత్తం తడిచిపోయాయని బాలుడు సీఎం దృష్టికి తీసుకెళ్లాడు. ఆ ఏరియాలో వరద నీరు వచ్చే ప్రాంతంలో గేట్ లాంటివి ఏర్పాటు చేయడంపై ఆలోచించాలని అధికారులకు సీఎం సూచించారు. కొన్నిచోట్ల డ్రైనేజీ పైప్ లైన్ కంటే కిందకు ఇండ్లు ఉన్నాయని ఈ సమస్య త్వరగా పరిష్కరించాలని అధికారులకు రేవంత్ రెడ్డి సూచించారు. తమ కాలనీకి వచ్చి స్వయంగా వరద నీటి సమస్య, ముంపు సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీయడంపై ఆ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**- సీఎంతో మాట్లాడానంటే కాలనీవాళ్లు నమ్మలేదు..**

సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి తమ కాలనీ సమస్యలు తెలిపిన బాలుడు జశ్వంత్ తన అనుభవాలు షేర్ చేసుకున్నాడు. తాను సీఎంతో మాట్లాడి తమ సమస్యలు చెప్పానంటే మొదట ఇది చూడని వాళ్లు ఎవరూ నమ్మలేదన్నాడు. అయితే సీఎం రేవంత్ రెడ్డితో తాను మాట్లాడి, సమస్యలు వివరిస్తానని అస్సలు ఊహించలేదన్నాడు. నా పేరేంటని సీఎం సార్ అడిగారు. ఏ క్లాస్ చదువుతున్నావని అడిగారు.

2లో..

## బెంగళూరు.. సింబల్ ఆఫ్ న్యూ ఇండియా

**- బెంగళూరు ఎల్లో లైన్ మెట్రో ప్రారంభించిన మోదీ**




**బెంగుళూరు (ప్రశ్న న్యూస్)** భారత ప్రధాని నరేంద్ర మోదీ బెంగళూరులోని కేఎస్ఆర్ రైల్వే స్టేషన్ లో 3 వందే భారత్ ఎక్స్ప్రెస్ రైళ్లను ప్రారంభించారు. ఇందులో బెంగళూరు - బెలగావి మధ్య నడిచే వందే భారత్, అమృత్సర్ నుంచి శ్రీ మాతా వైష్ణో దేవి కత్రాతో పాటు నాగ్‌పూర్ (అజ్ని) - పూణే మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయి. ప్రధాని మోదీ

2లో..

## అమెరికాకు షాకిచ్చిన పుతిన్

**- ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్‌కు పతకాన్ని అందజేత**




**మాస్కో (ప్రశ్న న్యూస్)** అంతర్జాతీయ రాజకీయాల్లో తనదైన శైలితో ప్రత్యర్థులకు చుక్కలు చూపే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, తాజాగా అమెరికాను ఇరుకునపెట్టేలా సంచలన ఎత్తుగడ వేశారు. అమెరికా గూఢచార సంస్థ సీఐఏ డిప్యూటీ డైరెక్టర్‌నే లక్ష్యంగా చేసుకుని ఆయన ఆడిన మైండ్‌గేమ్‌తో వాషింగ్టన్ వర్గాలు

2లో..

## పాత ఫార్ములాతోనే ముందుకు

**- డెడ్ లైన్ లోపు అవుతుందా.?**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పాత ఫార్ములతోనే ఈసారి కూడా ముందుకు వెళుతున్నారు. 2014 ఎన్నికల్లో ఏ ఫార్ములాతో అయితే వెళ్లారో అదే ఫార్ములాను ఈసారి కూడా ఫాలో అవుతున్నారు. ముఖ్యంగా అమరావతి రాజధాని నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. 2027 నాటికల్లా పోలవరం ప్రాజెక్టు నుంచి నీరు అందిస్తామని చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్నారు. అలాగే రాజధాని అమరావతి నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. దీనికి మూడేళ్లు గడువు పెట్టారు. అంటే 2028వ సంవత్సరం నాటికి మొదటి దశ అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేసే లక్ష్యాన్నిఅధికారులకు నిర్దేశించారు.

**- రాజధాని నిర్మాణ పనులు పూర్తయితే..**

అమరావతి రాజధాని నిర్మాణం మొదటి దశ నిర్మాణ పనులు పూర్తయితే కొంత హైప్ వస్తుందని భావిస్తున్నారు. భారీభవనాలతో పాటు అక్కడ అధికారుల నివాసాలకు సంబంధించిన పనులు కూడా పూర్తవుతాయి. ఈ నిర్మాణాలు పూర్తయితే అమరావతి ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంటుందన్న భావన అధికార పార్టీ నేతల్లో ఉంది. అయితే రాజధాని నిర్మాణ పనులకు సంబంధించి కాంట్రాక్టు పొందిన సంస్థలు భవన నిర్మాణ కార్మికులకుగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని ఉపయోగించడం కొంత విమర్శలకు దారి తీస్తుంది. ఇక్కడ జరుగుతున్న పనుల్లో ఏపీకి చెందిన భవన నిర్మాణ కార్మికులను

2లో..

## సింగరేణి కరప్షన్ గనిగా మారింది

**- దసరా తర్వాత సింగరేణి యాత్ర చేస్తామన్న కవిత**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కరప్షన్ గనిగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఉద్యోగ నియామకాలతో సహా అన్నింట్లో కాంగ్రెస్ పార్టీ అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ అంచనా వ్యయాలను రాత్రికి రాత్రే అమాంతం పెంచారని దుయ్యబట్టారు. సింగరేణిని కాపాడుకోవాలన్న ఉద్దేశంతో కేసీఆర్ సింగరేణిలో రాజకీయ అవినీతిని అంతం చేశారని, కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో రాజకీయ అవినీతి పెరిగిందని స్పష్టం చేశారు. కాబట్టి సింగరేణి సంస్థ కేంద్ర విజిలెన్స్, సీబీఐ పరిధిలోకి వచ్చే విధంగా సంస్థ మారాలని అభిప్రాయపడ్డారు. కార్మికులకు భరోసా ఇవ్వడానికి త్వరలో సింగరేణి యాత్ర చేపడుతామని ప్రకటించారు. ప్రశ్నిస్తే ఉద్యోగాలను తీసేసే దౌర్భాగ్య పరిస్థితులు ఏర్పడ్డాయని,

2లో..

## చిన్న పట్టణాలకూ ఐటీ

**- కేసీఆర్ విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలన్న కేటీఆర్**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** చిన్న పట్టణాలకు ఐటీ రంగాన్ని విస్తరించే విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తన కృషిని కొనసాగించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ ఆకాంక్షించారు. ఆదివారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా కేటీఆర్ స్పందిస్తూ, "కేసీఆర్ ప్రభుత్వ హయాంలో టైర్-2 నగరాలకు ఐటీని తీసుకెళ్లడం మా ప్రాధాన్యతగా ఉండేది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ పర్యావరణ వ్యవస్థను మెరుగుపరచడానికి

2లో..

## వీటిని ఎన్నికలు అనడానికే సిగ్గుగా ఉంది

**- జడ్పీటీసీ ఉప ఎన్నికలపై జగన్ స్పందన**

- అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నికలను హైజాక్ చేస్తున్నారని విమర్శ
- వైసీపీ నేతలపై టీడీపీ గ్యాంగులు దాడులు, హత్యాయత్నాలకు పాల్పడుతున్నాయని ధ్వజం
- బాధితులపైనే పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్య విరుద్ధంగా, అరాచకంగా వ్యవహరిస్తున్నారని, కుట్రలు, దాడులు, అబద్ధాలతో అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారని

2లో..

## సృష్టి హాస్పిటల్ కేసులో కీలక పరిణామం

**- రంగంలోకి దిగిన ఈడీ, పోలీసులకు లేఖ**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సృష్టి ఫర్టిలిటీ సెంటర్ కేసు తీవ్రత జాతీయ స్థాయికి చేరింది. డాక్టర్ నమ్రతకు చెందిన సృష్టి హాస్పిటల్ పెద్ద ఎత్తున నగదు లావాదేవిలు జరపడంతో మనీల్యాండరింగ్ ఆరోపణలు వచ్చాయి.

2లో..

## కాషాయ దళంలోకి గువ్వల బాలరాజు

**- కండువా కప్పి ఆహ్వానించిన బీజేపీ రాష్ట్ర చీఫ్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీజేపీలో చేరారు. ఆదివారం నాడు హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు బాలరాజుకు కాషాయ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గువ్వలతో పాటు ఆయన అనుచరులు, నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు కూడా బీజేపీ సభ్యత్వం స్వీకరించారు. కొన్ని రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినప్పటి నుంచి గువ్వల బాలరాజు ఏ పార్టీలో చేరతారనే

2లో..

## జవహర్ ఎత్తిపోతల పథకానికి మంత్రులు శంకుస్థాపన

**- మధిర కు నీళ్ల ఇవ్వడాన్ని అదృష్టంగా బావిస్తున్నానన్న భట్టి**



**మధిర (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని

2లో..

# సీఎం రేవంత్ రెడ్డి ఆకస్మిక పర్యటన

తరువాత మా కాలనీ సమస్యలు అడిగితే.. వర్షాల సమయంలో ఇబ్బంది ఎక్కువగా ఉందని, ఇండ్లలోకి వరద నీరు వస్తుందని చెప్పినట్లు జశ్వంత్ వివరించాడు. అధికారులకు చెప్పి అన్ని సమస్యలు పరిష్కరిస్తామని, భవిష్యత్తులో ఆ కాలనీలకు వరద ముప్పు లేకుండా చూస్తామని సీఎం తనతో చెప్పారని బాలుడు పేర్కొన్నాడు. సీఎంతో మాట్లాడటం ఊహించలేదని, కొత్త అనుభవంలా ఉందన్నాడు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి అమీర్ పేట, బల్కంపేట ప్రాంతంలోని బుద్ధనగర్, గంగుబాయి బస్తీలు, మైత్రీవనం ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు. ఆ బస్తీల్లో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి భారీ వర్షాల సమయంల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

# ఆనాడు సాయం.. నేడు ప్రయోగం

ఇటీవల నాసా-ఇస్రో సంయుక్త 'నైసర్' మిషన్‌ను విజయవంతం చేసిన ఉత్సాహంతో, మరో కీలక ఘట్టానికి నాంది పలుకుతోంది. చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. రాబోయే రెండు నెలల్లో అమెరికాకు చెందిన 6,500 కిలోల బరువైన కమ్యూనికేషన్ శాటిలైట్‌ను భారత రాకెట్ ద్వారా ప్రయోగించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గతాన్ని గుర్తుచేసుకుంటూ, భారత అంతరిక్ష ప్రస్థానంలోని అద్భుతమైన పురోగతిని వివరించారు."ఆరు దశాబ్దాల క్రితం అమెరికా నుంచి మనం ఓ చిన్న రాకెట్‌ను అందుకున్నాం. కానీ ఇప్పుడు, అదే అమెరికా తయారు చేసిన భారీ ఉపగ్రహాన్ని మన రాకెట్ తో, మన భూభాగం నుంచి ప్రయోగించబోతున్నాం. ఇది ఎంతటి అద్భుతమైన ప్రగతి?" అని ఆయన వ్యాఖ్యానించారు. 1963లో ఇస్రో ప్రస్థానం ప్రారంభమైనప్పుడు, అభివృద్ధి చెందిన దేశాల కన్నా భారత్ సాంకేతికంగా వెనుకబడి ఉండేది. ఆ ఏడాది నవంబర్ 21న అమెరికా అందించిన చిన్న రాకెట్ ప్రయోగంతోనే భారత అంతరిక్ష కార్యక్రమానికి బీజం పడింది. ఆ తర్వాత 1975లో కూడా అమెరికా శాటిలైట్ డేటా సహాయంతోనే ఇస్రో దేశంలోని 2,400 గ్రామాల్లో టెలివిజన్ల ద్వారా 'మాస్ కమ్యూనికేషన్' ప్రయోగాన్ని విజయవంతం చేసింది.ఇటీవల జూలై 30న ఇస్రో, నాసా సంయుక్తంగా రూపొందించిన నైసర్ (నాసా-ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్) ఉపగ్రహాన్ని జీఎస్ఎల్వి-ఎఫ్16 రాకెట్ ద్వారా విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ మిషన్ కచ్చితత్వంపై నాసా శాస్త్రవేత్తలు సైతం ఇస్రో పనితీరును ప్రశంసించారు. "ఈ విజయంతో మనం అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలిచాం" అని నారాయణన్ పేర్కొన్నారు. ఒకప్పుడు శాటిలైట్ టెక్నాలజీ లేని స్థాయి నుంచి, గడిచిన 50 ఏళ్లలో ఇస్రో అప్రతిహత ప్రగతిని సాధించింది. ఇప్పటివరకు 34 దేశాలకు చెందిన 433 ఉపగ్రహాలను తన సొంత రాకెట్ల ద్వారా విజయవంతంగా ప్రయోగించి, ప్రపంచ అంతరిక్ష వాణిజ్యంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.

# 'ఓట్ చోరీ' వెబ్ సైట్ ఆవిష్కరించిన రాహుల్ గాంధీ

దానిని అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రచారానికి సంబంధించి రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా ఒక వీడియోను పంచుకున్నారు. "వోట్ చోరీని బహిర్గతం చేయడం చాలా కీలకం" అని ఆయన పేర్కొన్నారు. "దేశంలో జరుగుతున్న ఓట్ల దొంగతనాన్ని ఆపేందుకు ప్రారంభించిన ఈ ప్రచారానికి మనస్ఫూర్తిగా మద్దతివ్వండి. ఇది ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటం" అని ఆయన అన్నారు. స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలకు స్వచ్ఛమైన ఓటర్ల జాబితా అత్యంత ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు, పార్టీలు ఓటర్ల జాబితాను తనిఖీ చేసేందుకు వీలుగా ఈసీఐ పారదర్శకంగా వ్యవహరించి డిజిటల్ ఓటర్ల జాబితాను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రచారానికి మద్దతుగా ఓట్ చోరీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా 9650003420 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని ఆయన కోరారు. గత 10 ఏళ్ల ఎలక్ట్రానిక్ ఓటర్ల జాబితాను, వాటికి సంబంధించిన వీడియో రికార్డింగ్‌లను అందించాలని ఆగస్టు 8న బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ ఈసీఐని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. అలా చేయడంలో విఫలమైతే, ఎన్నికల మోసాన్ని ఈసీఐ కప్పిపుచ్చినట్లే అవుతుందని, అది నేరంతో సమానమని ఆయన హెచ్చరించారు. అయితే, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం "ఆధారరహితమైనవి"గా కొట్టిపారేసింది. ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి కట్టుబడి ఉన్నామని ఈసీఐ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, నేడు పార్లమెంట్ కాంప్లెక్స్ నుంచి ఢిల్లీలోని ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ఇండియా కూటమి ఎంపీలతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించడానికి రాహుల్ గాంధీ సిద్ధమవుతున్నారు. ఈసీఐ అధికారులతో సమావేశం కోసం కూటమి నేతలు ఇప్పటికే సమయం కోరినట్లు సమాచారం. అదే రోజు రాత్రి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇండియా కూటమి ఎంపీలకు విందు ఇవ్వనున్నారు. బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఐక్యంగా పోరాడేందుకు విపక్షాలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నాయి.

# ట్రంప్‌పై విరుచుకుపడిన రాజ్‌నాథ్ సింగ్

ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. "కొందరు 'బాస్'లు భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న వేగాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. మనమే అందరికీ బాస్ అయితే, భారత్ ఇంత వేగంగా ఎలా అభివృద్ధి చెందుతోందని వారు అనుకుంటున్నారు?" అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని రైసెన్ జిల్లా, ఉమరియా గ్రామంలో బీఈఎంఎల్ కొత్త యూనిట్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. "కొన్ని దేశాలు భారతీయ ఉత్పత్తులను ఇతర దేశాల ఉత్పత్తుల కంటే ఖరీదైనవిగా చేయడానికి ప్రయత్నిస్తున్నాయి, తద్వారా ధరలు పెరిగితే ప్రపంచం వాటిని కొనడం మానేస్తుంది" అని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. అయినప్పటికీ, "భారత్ ఇంత వేగంగా ముందుకు సాగుతోంది, ఇప్పుడు ఏ శక్తీ భారత్‌ను ప్రపంచంలో ఒక గొప్ప శక్తిగా ఎదగకుండా ఆపలేదు" అని ఆయన ధీమాగా చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రక్షణ రంగంలో అద్భుతమైన మార్పు వచ్చిందన్నారు. "ఒకప్పుడు ఆయుధాల నుంచి యుద్ధ విమానాల వరకు దిగుమతి చేసుకునేవాళ్ళం. కానీ ఇప్పుడు మనం వాటిని మన దేశంలోనే తయారు చేయడమే కాకుండా, ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. ఒకప్పుడు అతి తక్కువగా ఉన్న మన రక్షణ ఎగుమతులు ఇప్పుడు ఏకంగా రూ. 24,000 కోట్లకు పెరిగాయి. ఇది మన పెరుగుతున్న సామర్థ్యానికి నిదర్శనం" అని ఆయన వివరించారు. దేశ భద్రతను బలోపేతం చేయడంతో పాటు, రక్షణ రంగం దేశ ఆర్థిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

# పాత ఫార్ములాతోనే ముందుకు

వినియోగించుకోవాలన్న డిమాండ్ వినపడుతుంది.

**- సాగు, తాగు నీరు అందంచగలిగితే..**

పోలవరం ప్రాజెక్టు పనులు కూడా ప్రస్తుతం ఎనభై శాతం పూర్తయ్యాయయని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. 2027 నాటికిపనులు పూర్తి చేసి ఖరీఫ్ సీజన్ కు సాగు నీరు అందించగలిగితే చాలా వరకూ ప్రభుత్వం సక్సెస్ అయినట్లే. ముఖ్యంగా రైతులు ప్రయోజనం పొంది కూటమి ప్రభుత్వానికి అండగా నిలబడే అవకాశముందని అంటున్నారు. నీటి పారుదల శాఖ అధికారులతో పాటు కాంట్రాక్టు సంస్థల యాజమాన్యాలకు కూడా హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో పనులు పూర్తి చేయడమే కాకుండా రైతులకు సాగు నీరు అందించడంతో పాటుగా కొన్ని ప్రాంతాలకు తాగు నీటి సౌకర్యం కూడా కల్పించాలన్న ఉద్దేశ్యంతో చంద్రబాబు అధికారుల వెంట పడుతున్నారు.

**- భారీ వర్షాలు, వరదలకు..**

కానీ భారీ వర్షాలకు రెండు పనులకు ఆటంకంగా మారుతుందని అధికారులు చెబుతున్నారు. రాజధాని అమరావతిలో ఇంకా వర్షపు నీటిని తోడేందుకు మోటార్లను ముమ్మరంగా వినియోగిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు విషయంలోనూ పోటెత్తతుతున్న వరద పనులకు ఆటంకంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో అనుకున్న లక్ష్యానికి పోలవరం, అమరావతి పనులు పూర్తవుతాయా? లేదా? అన్న సందేహం కొంత అధికార పార్టీ నేతల్లో కనిపిస్తుంది. జమిలి ఎన్నికలు వస్తే ముందుగానే ఎన్నికలు వస్తే ఇక పనులు అసంపూర్తిగా నిలిచిపోతాయేమోనన్న ఆందోళన వ్యక్తమవుతుంది. అందుకే చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో ఈ ఫార్ములా అనుకూలంగా పనిచేస్తుందా? లేదా? అన్నది కాలమే నిర్ణయిస్తుంది.

# కాషాయ దళంలోకి గువ్వల బాలరాజు

దానిపై తీవ్రమైన చర్చ నడిచింది. గతంలో తనపై దాడి జరిగినప్పుడు పార్టీ నాయకత్వం అండగా నిలవలేదని, తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆయన బీఆర్ఎస్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన పార్టీని వీడగా, తాజాగా బీజేపీలో చేరడంతో ఊహాగానాలకు తెరపడింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, దేశవ్యాప్తంగా బీజేపీకి పెరుగుతున్న ఆదరణ చూసి గువ్వల బాలరాజు పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. తెలంగాణలో పార్టీ బలోపేతానికి ఆయన సేవలను పూర్తిగా వినియోగించుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ లక్ష్మణ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డితో పాటు ఇతర సీనియర్ నాయకులు పాల్గొని గువ్వల బాలరాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

# బెంగళూరు.. సింబల్ ఆఫ్ న్యూ ఇండియా

ఎలక్ట్రానిక్ సిటీ స్టేషన్ వరకు మెట్రోలో ప్రయాణించారు. ప్రధానమంత్రి కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం, బెంగళూరు మెట్రో ఫేజ్-2 ప్రాజెక్ట్ ఆర్వీ రోడ్ (రాగిగుడ్డ) నుంచి బొమ్మసంద్ర వరకు యెల్లో లైన్ మెట్రో, ఇది 19 కిలోమీటర్ల కంటే ఎక్కువ పొడవుతో పాటు 16 స్టేషన్లను కలిగి ఉంది. దాదాపు 7,160 కోట్ల రూపాయలతో నిర్మించారు.

**- బెంగళూరుతో 96 కిలోమీటర్లకు చేరిన మెట్రో లైన్**

ఈ యెల్లో లైన్ ప్రారంభంతో బెంగళూరులో ప్రస్తుతం ఉన్న మెట్రో నెట్‌వర్క్ పొడవు 96 కిలోమీటర్లకు పెరిగింది. ఇది ఈ ప్రాంతంలోని రద్దీ జనాభాకు సేవలు అందిస్తుంది. ప్రధాని మోదీ ప్రారంభించిన బెంగళూరు ఎల్లో లైన్ హొసూర్ రోడ్, సిల్క్ బోర్డ్ జంక్షన్, ఎలక్ట్రానిక్స్ సిటీ జంక్షన్ వంటి రద్దీ ప్రదేశాలలో ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తుందని అధికారులు తెలిపారు.

**- బెంగళూరు మెట్రో ఫేజ్-3 ప్రాజెక్ట్ శంకుస్థాపన**

కర్ణాటక పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ బెంగళూరు మెట్రో ఫేజ్-3 ప్రాజెక్ట్‌కు స్వయంగా శంకుస్థాపన చేశారు. ఆరెంజ్ లైన్ అని దీనికి నామకరణం చేశారు. బెంగళూరు మెట్రో ఫేజ్-3 నిర్మాణం సుమారు 15,611 కోట్ల రూపాయలతో చేపడుతున్నారు. ఈ ప్రాజెక్ట్ మొత్తం పొడవు 44 కిలోమీటర్లు ఉంటుంది. ఈ ప్రాజెక్టులో 31 ఎలివేటెడ్ స్టేషన్లు ఉంటాయి. ఈ మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్ బెంగళూరు నగరంలో పెరుగుతున్న జనాభా, రవాణా అవసరాలను తీరుస్తుందని అంచనా వేశారు. నివాస, పారిశ్రామిక, వాణిజ్య అవసరాలతో పాటు విద్యా సంబంధిత అవసరాలను తీరుస్తుంది. బెంగళూరు ఫేజ్-3లో రెండు కారిడార్లు లేదా లైన్లు ఉంటాయి. ఇందులో జెడ్పీ జేపీ నగర్ 4వ ఫేజ్ నుంచి కెంపపురా (32.15 కిలోమీటర్లు), హొసహళ్లి నుంచి కదబాగెరె (12.5 కిలోమీటర్లు) లైన్లు ఉన్నాయి.

**- హెచ్ఏఎల్ విమానాశ్రయానికి వెళ్లిన మోదీ**

షెడ్యూల్ ప్రకారం ప్రధాని నరేంద్ర మోదీ ఇంటర్నేషనల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్స్టిట్యూట్ (ఐఐటీ) బెంగళూరును సందర్శించారు ఇక్కడ ఆయన బెంగళూరు మెట్రో ఫేజ్-3కి శంకుస్థాపన చేశారు. నగరంలోని ఆర్వీ రోడ్ (రాగిగుడ్డ) నుంచి బొమ్మసంద్ర మెట్రో స్టేషన్ వరకు నడిచే యెల్లో లైన్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఆ తరువాత అక్కడ జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా హెచ్ఏఎల్ విమానాశ్రయానికి వెళ్లి అటు నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు ఢిల్లీకి ప్రధాని మోదీ తిరుగు ప్రయాణం అయ్యారు.

# అమెరికాకు షాకిచ్చిన పుతిన్

దిగ్భ్రాంతికి గురయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరపున ప్రత్యేక దూతగా క్రెమ్లిన్‌కు వచ్చిన స్టీవ్ విట్కాఫ్‌తో సమావేశమైన పుతిన్, ఓ అనూహ్య బహుమతిని ఆయన చేతికి అందించి కలకలం రేపారు. అమెరికా గూఢచార సంస్థ సీఐఏ డిప్యూటీ డైరెక్టర్ జూలియన్ గల్లినా కుమారుడైన మైఖేల్ గ్లోస్‌కు 'ఆర్డర్ ఆఫ్ లెనిన్' పతకాన్ని బహూకరిస్తున్నట్లు పుతిన్ ప్రకటించారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తరపున పోరాడుతూ మైఖేల్ వీరమరణం పొందాడని, ఆయన ధైర్యసాహసాలకు గుర్తుగా ఈ పతకాన్ని అందజేస్తున్నామని తెలిపారు. ఈ పతకాన్ని జూలియన్‌కు చేరవేయాలని విట్కాఫ్‌ను పుతిన్ కోరారు. ఈ చర్యతో అమెరికా గూఢచార వర్గాల్లోనే అనుమానాలు రేకెత్తించాలని, అమెరికాను ఆత్మరక్షణలోకి నెట్టాలని పుతిన్ ప్రయత్నించినట్లు స్పష్టమవుతోంది. ఈ సంఘటన వెనుక పుతిన్ ఉద్దేశం అమెరికా సీఐఏ ఉన్నతాధికారిణి కుమారుడు రష్యా పక్షాన యుద్ధంలో పాల్గొన్నాడనే ప్రశ్నలను లేవనెత్తడమేనని నిపుణులు అనుమానిస్తున్నారు. మైఖేల్ గ్లోస్ గతంలో సోషల్ మీడియాలో రష్యాకు మద్దతుగా పోస్టులు పెట్టాడని, మాస్కోలో ఉన్న చిత్రాలు కూడా బయటకు వచ్చాయని సమాచారం.

అతడు 2024 ఏప్రిల్‌లో తూర్పు ఐరోపాలో మరణించినట్లు వార్తలొచ్చాయి. మైఖేల్ మృతదేహం అమెరికాకు చేరిన తర్వాత, 2025 ఏప్రిల్‌లో సీఐఏ ఓ ప్రకటన విడుదల చేసింది. మైఖేల్ మరణానికి, జాతీయ భద్రతకు ఎలాంటి సంబంధం లేదని, అతడు కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని ఆ ప్రకటనలో పేర్కొంది. పుతిన్ ఇచ్చిన పతకాన్ని విట్కాఫ్ స్వీకరించారా లేదా అనే దానిపై స్పష్టత లేదు. ఈ ఘటనపై అటు రష్యా గానీ, ఇటు అమెరికా, సీఐఏ లేదా విట్కాఫ్ వర్గాలు గానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. కేవలం అమెరికాను రెచ్చగొట్టేందుకే పుతిన్ ఈ చర్యకు పాల్పడ్డారని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సింగరేణి కరప్షన్ గనిగా మారింది

దానికి అడ్డుకట్టవేస్తామని తేల్చిచెప్పారు. ఆదివారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఎమ్మెల్సీ కవిత మధ్య కీలక చర్చలు జరిగాయి. తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థ అయిన సింగరేణి జాగృతి, హెచ్ఎంఎస్ సంఘం కలిసి పనిచేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి ప్రాంతం మినీ ఇండియాగా మారిందని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సింగరేణిని కాపాడుకోవాలన్న కృతనిశ్చయంతో కేసీఆర్ ఎంతో కృషి చేశారని, ఇప్పుడు దాదాపు 40 వేల మంది ఉద్యోగులతో సింగరేణి కలకలలాడుతోందని అన్నారు. ఏటా ఐదు గనులు తెరిచినా కూడా 185 గనులు తెరిచేంత బొగ్గు నిల్వలు తెలంగాణ భూగర్భంలో ఉన్నాయని చెప్పారు.సింగరేణిలో అండర్ గ్రౌండ్ మ్యాన్యువల్ గనులను తెరవాలని డిమాండ్ చేశారు. ఓపెన్ కాస్ట్ మైనింగ్ వల్ల పెద్ద వాళ్లకే లాభమవుతుందని, పైగా కాలుష్యం తీవ్రమవుతోందని అన్నారు. సగటున ఒక్కో సింగరేణి కార్మికుడు రోజుకు ఆరు టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తారని, అంటే ఒక్కో కార్మికుడు రోజుకు దాదాపు రూ 30 వేలను ప్రభుత్వానికి సంపాదించిపెడుతున్నారని వివరించారు. కానీ సింగరేణి కార్మికులు ప్రభుత్వం ఇచ్చేది చాలా తక్కువగా ఉంటుందని, పైగా జీతంపై ప్రధాని మోదీ ఆదాయపు పన్ను కూడా విధిస్తున్నారని మండిపడ్డారు.

సింగరేణి ఉద్యోగులకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణం కోసం కేసీఆర్ సింగరేణి కార్మికులకు రూ. 10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను ఇప్పించారని పేర్కొన్నారు. 22 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు హైలెవెల్ కమిటీ చేసిన సిఫారసుల మేరకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమం ప్రధాన ఎజెండాగా పెట్టుకొని పనిచేస్తామని తెలిపారు. కార్మికుల హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎండగడుతామని స్పష్టం చేశారు. గత బోనస్ విషయంలో కార్మికులను కాంగ్రెస్ పార్టీ నయవంచనకు గురి చేసిందని, లాభాల్లో 33 శాతం వాటా బోనస్ గా ఇస్తున్నామని చెప్పి అసలు లాభాలనే తక్కువ చేసి చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికులు ఏడాది దసరాకు బోనస్ గా లాభాల్లో 37 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెచ్ఎంఎస్ కార్మిక సంస్థ సుభాష్ చంద్రబోస్ పెట్టిన సంస్థ అని, బ్రిటీష్ హయాంలో కార్మికుల కోసం పోరాడడానికి ఏర్పాటు చేసిన సంస్థ అని, అది ఇక్కడ స్వతంత్రంగా పనిచేస్తోందని వివరించారు.

హెఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అనేక కార్మిక ఉద్యమాలు చేపట్టారని, సింగరేణి కార్మికుల కోసం కొట్లాడి అధిక బోనస్ సాధించడంలో కీలక పాత్రపోషించారని కొనియాడారు. హెచ్ఎంఎస్ తో కలిసి సింగరేణి జాగృతి కలిసి పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ కలయిక భవిష్యత్తులో అన్ని వామపక్ష పార్టీల అనుబంధ సంఘాల ఐక్యతకు దారితీస్తుందని చెప్పారు. కాగా, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానికి (టీబీజీకేఎస్) తాను గౌరవ అధ్యక్షురాలిగా ఉన్నానని, కాబట్టి క్షేత్రస్థాయిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న ప్రతీ ఒక్కరు కలిసి పనిచేయాల్సిందేనని వివరించారు.

# చిన్న పట్టణాలకూ ఐటీ

కృషి చేస్తుందని ఆశిస్తున్నాను" అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో నల్గొండ, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం, సిద్దిపేటతో పాటు ఆదిలాబాద్‌లోనూ ఐటీ హబ్‌లను ప్రారంభించామని ఆయన గుర్తుచేశారు. చిన్న, మధ్య తరహా ఐటీ కంపెనీలకు ప్లగ్-అండ్-ప్లే సౌకర్యాలు కల్పించడం, స్టార్టప్ వాతావరణాన్ని ప్రోత్సహించడం, టాస్క్ కేంద్రాల ద్వారా నైపుణ్యాభివృద్ధి అందించడం తమ లక్ష్యమని వివరించారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదిలాబాద్ ఐటీ టవర్‌ను రూ. 40 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేసింది. నిర్మాణ వ్యయం రూ. 58 కోట్లకు పెరిగినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేసి పనులను కొనసాగిస్తోంది. ఈ టవర్ పూర్తయితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు. సుమారు 68,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ జీ+4 భవనంలో 635 మంది ఉద్యోగులు పనిచేసేందుకు వీలుంటుంది. మూడు షిఫ్టుల్లో కలిపి దాదాపు 1,900 మందికి ఉపాధి లభించనుంది. టైర్-2 నగరాల్లోని ఐటీ టవర్లలో పూర్తిస్థాయిలో కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించేలా చూసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.
కంపెనీలను ఆకర్షించేందుకు మెరుగైన రోడ్లు, 24 గంటల విద్యుత్, ఫైబర్ కనెక్టివిటీ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఐటీ అభివృద్ధిని కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా, రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# వీటిని ఎన్నికలు అనడానికే సిగ్గుగా ఉంది

వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల నేపథ్యంలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, ఎన్నికలను హైజాక్ చేసేందుకు చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ గూండాలు, కొందరు అధికారులు, పోలీసులు కలిసి ఈ కుట్రను అమలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు కుట్రపూరిత ప్రణాళికలను అమలు చేస్తున్నారని మండపడ్డారు. "ఉపఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచే పోలీసులు దౌర్జన్యాలు మొదలుపెట్టారు. గతంలో ఎలాంటి కేసులు లేని వారిపై కూడా బైండోవర్ కేసులు పెట్టి వైసీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు" అని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న తమ పార్టీ నేతలే లక్ష్యంగా టీడీపీ గ్యాంగులు దాడులకు తెగబడుతున్నాయని జగన్ ఆరోపించారు. ఆగస్టు 6న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, నేత వేల్పుల రామలింగారెడ్డిపై హత్యాయత్నం జరిగిందని, వారి కారును ధ్వంసం చేసి నిప్పంటించే ప్రయత్నం కూడా చేశారని తెలిపారు. ఈ దాడుల సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని విమర్శించారు. వైసీపీ తరపున పనిచేస్తే ఇలాంటి దాడులే ఎదురవుతాయని భయపెట్టడానికే ఈ దారుణాలకు పాల్పడ్డారని అన్నారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయకుండా, బాధితులైన వేల్పుల రాముతో

పాటు మరో 50 మందిపై ఆగస్టు 6న మధ్యాహ్నం 3:30 గంటలకు తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని జగన్ ఆరోపించారు. "ఆగస్టు 8న మా పార్టీ నేతను బెదిరించి, ప్రలోభపెట్టి ఫిర్యాదు తీసుకుని రాఘవరెడ్డి, గంగాధర్ రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి వంటి వారికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. అదే రోజున పులివెందులలో వైసీపీకి ఓట్లు వేసే సుమారు 4,000 మంది ఓటర్లను ఇబ్బంది పెట్టేందుకు, పోలింగ్ బూత్‌లను గ్రామాలకు 2 నుంచి 4 కిలోమీటర్ల దూరానికి మార్చారు. బూత్ కబ్జా, రిగ్గింగ్‌కు ఆస్కారం కల్పించారు" అని ఆయన విమర్శించారు. పోలింగ్ రోజున మీడియా కవరేజీని నియంత్రించి, తమ దాడులు, దౌర్జన్యాలు బయటకు రాకుండా చూడాలని టీడీపీ ప్లాన్ చేస్తోందని జగన్ అన్నారు. "నిజం చెప్పాలంటే వీటిని ఎన్నికలు అనడానికే సిగ్గుగా ఉంది. అయినా నాకు దేవుడిపై, ప్రజలపై నమ్మకం ఉంది. అంతిమంగా ధర్మమే గెలుస్తుంది" అని జగన్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# సృష్టి హాస్పిటల్ కేసులో కీలక పరిణామం

దాంతో తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన సృష్టి హాస్పిటల్ కేసులో (ఈడీ) రంగ ప్రవేశం చేసింది. తమకు కేసు వివరాలను తెలియజేయాలని ఈడీ అధికారులు హైదరాబాద్ పోలీసులకు లేఖ రాశారు.

**- 8 రాష్ట్రాల్లో కార్యకలాపాలు**

డాక్టర్ నమ్రత సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ పేరుతో 8 రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగించినట్లు పోలీసులు గుర్తించారు. దాదాపు 80 మంది పిల్లలను విక్రయించి రూ.25 కోట్ల వరకు వసూలు చేసినట్లు భావిస్తున్నారు. ఆ డబ్బును డాక్టర్ నమ్రత విదేశాల్లో పెట్టుబడులు పెట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నమ్రతా బ్యాంక్ ఖాతాలతోపాటు, సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ బ్యాంక్ లావాదేవీలను పరిశీలించిన అధికారులు మనీ లాండరింగ్ జరిగిందని గుర్తించారు. సృష్టి ఫర్టిలిటీ సెంటర్ డాక్టర్ నమ్రత ఎనిమిది రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. చైల్డ్ ట్రాఫికింగ్ ద్వారా కోట్ల రూపాయలు సంపాదించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద ఎత్తున మనీ లాండరింగ్ జరిగిందన్న ఆరోపణలతో ఈడీ రంగంలోకి దిగింది.

**- సంతానలేమితో వస్తున్న దంపతులే ఆమె టార్గెట్**

సంతానం కలగడం లేదని ఆస్పత్రికి వస్తున్న దంపతులను లక్ష్యంగా చేసుకుని ఐవీఎఫ్ విధానంలో పిల్లలు పుడతారని నమ్మించి వారి వద్ద నుంచి లక్షల రూపాయాల్లో వసూలు చేసినట్లు డాక్టర్ నమ్రతపై ఆరోపణలున్నాయి. బిక్షాటన చేసేవారు, మద్యం తాగడానికి డబ్బుల కోసం చూసే వారిని తీసుకెళ్లి వారికి వెయ్యి రూపాయల చొప్పున ఇచ్చి వారి వద్ద నుంచి స్పెర్మ్ కలెక్ట్ చేసి ఐవీఎఫ్ చేశారని సైతం ఆరోపణలు వచ్చాయి. ఆపై నవజాత శిశువులను కొనుగోలు చేసి వారినే ఐవీఎఫ్ ద్వారా పుట్టిన పిల్లలు అని డాక్టర్ నమ్రత, హాస్పిటల్ సిబ్బంది ఎందరో దంపతుల నుంచి లక్షల రూపాయల చొప్పున వసూళ్లకు పాల్పడ్డారు.

**- నిందితులు అరెస్ట్**

ఇటీవల విజయవాడ పోలీసులు ఒక నవజాత శిశువును అమ్ముతున్న గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ గ్యాంగ్‌లో అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన ముగ్గురు మహిళలు ఉన్నారు. ఈ గ్యాంగ్ హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తూ పిల్లలను అమ్ముతున్నట్లు పోలీసులు తెలిపారు. విజయవాడలో ఇలాంటి మూడు నుంచి నాలుగు గ్యాంగ్లు క్రియాశీలంగా ఉన్నాయని సమాచారం. ఈ గ్యాంగ్లకు సృష్టి హాస్పిటల్‌తో సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ గ్యాంగ్ సభ్యులు సృష్టి హాస్పిటల్ హైదరాబాద్ ఆఫీస్, విజయవాడ బ్రాంచ్‌ను సైతం సందర్శించినట్లు పోలీసులకు ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ కేసులో పోలీసులు ఇదివరకే ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు. డాక్టర్ నమ్రత కేసు విచారణలో పోలీసులకు సహకరించడం లేదు. పైగా త్వరలోనే బయటకు వచ్చాక తనను ఇబ్బంది పెట్టిన వారి సంగతి చూస్తానని చెప్పడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏపీలో జరిగిన దానికి హైదరాబాద్ లో కేసు నమోదు విచారణ చేపట్టారని ఆమె తరపు లాయర్లు కోర్టులో పిటిషన్ వేశారు.

# జవహర్ ఎత్తిపోతల పథకానికి మంత్రులు శంకుస్థాపన

వంగవీడు గ్రామంలో రూ.630 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన జవహర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, పలువురు ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో సాగు నీటిని సమృద్ధిగా అందించేందుకు, ఈ ప్రాజెక్ట్‌ను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. రైతుల కలలను నెరవేర్చే ఈ మహత్తర పథకం త్వరితగతిన ఫలితాలు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం అన్నారు.

**- 60 వేల ఎకరాలకు సాగునీరే లక్ష్యం**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. "జవహర్ ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 60,000 ఎకరాల పొలాలకు సాగునీరు అందించనుంది. ఈ ప్రాజెక్టు రైతులకు జీవితాంతం మేలు చేసే విధంగా రూపుదిద్దుకుంటోంది. అందరికి శుభాకాంక్షలు. భట్టి విక్రమార్క అపర భగీరథుడిగా పనిచేస్తున్నారు. నాలుగు సార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచి, ప్రతిపక్ష నేతగా రాష్ట్ర ప్రజల కోసం పోరాడారు. అన్నీ అమ్ముడు పోయిన సమయంలో ఐదుగురు ఎమ్మెల్యేలతో కలిసి కేసీఆర్ ప్రభుత్వాన్ని ఎదుర్కొన్నారు."

**- గత ప్రభుత్వం కమీషన్ల కోసమే ప్రాజెక్టుల నిర్మాణం**

"ప్రజలను అడుగుతున్నాను - కేసీఆర్ హయాంలో డబుల్ బెడ్రూం ఇల్లు వచ్చిందా? రేషన్ కార్డు, సన్న బియ్యం వచ్చాయా? ప్రజలకు ఏమీ చేయని బీఆర్ఎస్ పార్టీ మనకు అవసరమా?. కేసీఆర్ కుటుంబం కన్నుపడిన తర్వాతే ఎస్ఎల్బీసీ సొరంగం కూలింది. దానిని తిరిగి పునరుద్ధరిస్తాం. త్వరలోనే పూర్తి చేస్తాం. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో పెండింగ్‌లో ఉన్న బ్రాహ్మణవెల్లెం, దిండి, పాలమూరు, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం. మునుపటి ప్రభుత్వాలు ప్రాజెక్టుల్ని కమిషన్ల కోసమే నిర్మించాయి."

**- పేదలకు ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ.5 లక్షలు**

"ఇందిరమ్మ ఇళ్ల కోసం ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల సహాయం అందిస్తున్నాం. రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇతర సంక్షేమ పథకాలన్నీ సజావుగా అమలు అవుతున్నాయి. ధరణి ద్వారా జరిగిన భూముల దోపిడీకి భిన్నంగా, ఇప్పుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు రెవెన్యూ మంత్రిగా రైతులు, పేదలకు ఇబ్బంది లేకుండా భూసంబంధిత సమస్యల పరిష్కారానికి 'భూ భారతి'ని తీసుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో, భట్టి విక్రమార్క సహకారంతో త్వరలో రూ.12,000 కోట్లతో ఆర్%డ%బీ రోడ్ల నిర్మాణం ప్రారంభం కానుంది. వంగవీడు గ్రామానికి డబుల్ రోడ్ కూడా రాబోతోంది. ప్రజలు ఆలోచించాలి.

బీఆర్ఎస్ లాంటి ప్రజలపై మట్టికొట్టే పార్టీలకు ఇక బై చెప్పాలి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు ఇవ్వాలని" మంత్రి కోమటిరెడ్డి కోరారు.

### రోజురోజుకీ రాహుల్ గాంధీ తెలివి ఏమవుతుందో..
## మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి సెటైర్లు



కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత నల్లారి కిరన్ కుమార్ రెడ్డి సెటైర్లు వేశారు. రోజురోజుకీ రాహుల్ గాంధీ తెలివి ఏమవుతుందో అర్థం కావడం లేదని విమర్శించారు. ఆటంబాంబు పేలుస్తామని రాహుల్ అన్నారని.. కానీ అది తుస్సుమనిపోయిందన్నారు.రాయచోటిలో మీడియాతో కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రిగ్గింగ్ చేసి, ఎన్నికల కమిషన్‌తో ములాఖత్ అయ్యి కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిందని రాహుల్ గాంధీ అన్నారని గుర్తుచేశారు. మాట్లాడేముందు కొంచెమైనా తెలివి ఉపయోగించాలి కదా అని విమర్శించారు. 2014లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే బీజేపీకి దగ్గర దగ్గర 282 సీట్లు వచ్చాయని గుర్తుచేశారు. దాదాపు 35 సంవత్సరాల తర్వాత మొట్ట మొదటిసారిగా ఒక పార్టీకి అప్పుడే పూర్తి మెజార్టీ వచ్చిందని అన్నారు. ఇక 2019లో 303 సీట్లు గెలుచుకుందని తెలిపారు. 2024లో జరిగిన ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగితే 400 సీట్లు రావాలి కానీ 240 సీట్లు ఎలా వస్తాయని రాహుల్‌గాంధీని కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్‌తో కలిసి బీజేపీ రిగ్గింగ్ చేస్తే 400 సీట్లు వచ్చేవి కానీ 240 సీట్లు ఎలా వస్తాయని నిలదీశారు. దీని గురించి బాగా ఆలోచించుకోవాలని సూచించారు. అన్ని సంవత్సరాలు పార్టీలో ఉన్న నాకే రాహుల్ గాంధీ మాటలు అర్థం కాలేదు.. ఇక ప్రజలకు ఎలా అర్థమవుతాయని ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఎన్నికల సమయంలో మహారాష్ట్రలో దాదాపు సగం ఎంపీ సీట్లు వచ్చాయని.. కానీ ఐదు నెలల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరిగితే పూర్తిగా డిపాజిట్లు ఎలా గల్లంతయ్యాయని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. కొంచెం తెలివిగా మాట్లాడాలని.. లేదంటే తెలివి ఉన్న వారిని పక్కన పెట్టుకోవాలని సూచించారు. 2019లో జరిగిన ఏపీ ఎన్నికల ఫలితాలను ఈ సందర్భంగా ఆయన ఉదాహరించారు. అప్పుడు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు కలిపి జరిగితే.. 156 అసెంబ్లీ స్థానాలు, 36 పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించిందని కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఒకేరోజు ఒకేసారి ఎన్నికలు జరిగితే పార్లమెంట్‌లో ఫుల్ మెజారిటీ వచ్చింది.. అసెంబ్లీలో తక్కువ మెజార్టీ వచ్చిందని గుర్తుచేశారు. దీన్ని రిగ్గింగ్ అంటారా అని ప్రశ్నించారు.

### సీఎం రేవంత్ రెడ్డికి ట్రిప్పుల మీదున్న మోజు
# రైతుల తిప్పలు తీర్చడంలో లేదు

### -ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



దేశంలోనే సాగులో తెలంగాణలో ఆకాశమంత సంపద సృష్టించిన కేసీఆర్‌కు కాంగ్రెస్ బురద అంటించే ప్రయత్నం చేస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. నేడు నిజామాబాద్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై ధ్వజమెత్తారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేసీఆర్ పడ్డ తాపత్రయం, తండ్లాట అర్థం కానివారే తప్పుడు కూతలు కూస్తారు. ఉమ్మడి రాష్ట్రంలో అనుభవాలను గమనించి దశాబ్ధాల తరబడి ప్రాజెక్టులు పూర్తి కాకుండా పోవడం చూసి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో సాగునీటి రంగాన్ని శీఘ్ర గతిన పనులయ్యే రంగంగా మార్చారు. ఎంత త్వరగా అయితే అంత తొందరగా తెలంగాణ బీడు భూములకు నీళ్లు పారించాలే అనే తాపత్రయంతో కేవలం మూడు సంవత్సరాల కాలంలో కాళేశ్వరం కట్టారు తప్ప ఇంకోటి కాదు. అందులో ఏ తప్పు జరుగలేదు. చీమంత సమస్య కూడా జరగని కాళేశ్వరం ప్రాజెక్టులో కొండంత సమస్యగా జరిగిందని దుష్ప్రచారం చేస్తున్నరన్నారు. ఒకప్పుడు తెలంగాణ వ్యవసాయం అంటే ఎత్తిపోయిన బోరు బావులు, చాలీ చాలని కరెంట్‌తో రైతులు గోస పడేవారు. దిక్కుతోచని స్థితిలో మొగులుకి మొఖం పెట్టి మా బీడు భూములు తడపడానికి ఒక చినుకు పడకపోతుందని రైతులు ఎదురు చూసేవారు. వ్యవసాయం దండగలా ఉండే..ఇప్పుడు గడిచిన గత 10 ఏండ్ల కేసీఆర్ పాలనలో మిషన్ కాకతీయతో చెరువులు బాగు చేసి వర్షపు నీటిని ఒడిసిపట్టి, చెరువులు నింపి, వాగులు వంకల్లో చెక్ డ్యామ్‌లు కట్టి నీటిని ఆపి ఎత్తిపోయిన బోర్లలో నీటి ధార వచ్చేట్టు చేసింది కేసీఆర్. కడుపు నిండా కరెంటుతో ,రైతు భీమాతో ,ఊరూరా కొనుగోలు కేంద్రాల్లో వ్యవసాయం పండగల మారింది. కాళేశ్వరంతో ఆంధ్రా ప్రాంతంలోనే కాదు మాకు కూడా చివరి ఆయకట్టుకు కాలువల ద్వారా సాగు నీరు వస్తది. మేము కూడా దర్జాగా రెండు లేదా వీలైతే మూడు పంటలు కూడా పండించుకోవచ్చు అని తెలంగాణ రైతాంగానికి ఒక భరోసా కలిగింది అంటేకారణం ఒకే ఒక్కడు.. అది కేసీఆర్ తన సంకల్ప దీక్షతో కాళేశ్వరం లాంటి ప్రాజెక్ట్ కట్టి తెలంగాణ సాగు బతుకు మార్చిన అపర భగీరథుడు మన పెద్ద రైతు కేసీఆర్ అని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.సాహసిలా ఈ ప్రాంతానికి నీటికష్టాలు తీర్చాలని ప్రాజెక్టు కట్టిన కేసీఆర్‌పై కాకమ్మ కథలు అల్లుతున్నరన్నారు. మేడిగడ్డను పండబెట్టి గోదావరి నీళ్లను ఆపకుండా నేరుగా క్రిందకు పోనిచ్చి (ఆంధ్రాకు) బనక చర్లకు గోదావరి నీళ్లను దోచిపెట్టి చంద్రబాబుకు గురుదక్షిణగా ఇవ్వడం కోసమే కాళేశ్వరం మీద దుష్ప్రచారం చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. దీంతోపాటు అసెంబ్లీ ఎన్నికల అప్పుడు కాళేశ్వరం కొట్టుకుపోయింది అని దుష్ప్రచారం చేసి ఇప్పుడు స్థానిక ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి ఘోష్ కమిషన్ రిపోర్ట్ అంటూ మళ్ళీ దుష్ప్రచారం చేస్తున్నారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ అంటే ఒక్క మెడిగడ్డ బరాజ్ ఒక్కటే కాదు. కాళేశ్వరం అంటే అందులో 3 బ్యారేజీలు,15 రిజర్వాయర్లు,19 సబ్ స్టేషన్లు, 21 పంప్ హౌజులు, 203 కిలోమీటర్ల సొరంగాలు,1531 కిలోమీటర్ల గ్రావిటి కెనాల్,98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్ 141 టిఎంసీల స్టోరేజ్ కెపాసిటీ,530 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్,240 టిఎంసీల ఉపయోగం%ా% వీటన్నింటి సమాహారం కాళేశ్వరం%ా% ఇన్ని ఉంటే అందులో ఒకే ఒక బ్యారేజీలో ఒకటి రెండు పిల్లర్లు కుంగిపోతే దానిని బాగు చేసి రైతాంగానికి నీరు ఇవ్వాల్సింది పోయి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం , రేవంత్ రెడ్డి ప్రాజెక్ట్ కొట్టుకుపోయింది అని అవినీతి అని నానా రాద్దాంతం చేస్తున్నదని విమర్శించారు.రేవంత్ ఢిల్లీ 51 సార్లు పోయారు. విదేశాలకు మూడు నాలుగు సార్లు వెళ్లారు. 21 నెలల పాలనలో మూడు నెలలపైన బయటే గడిపారు. సీఎంకు ట్రిప్పుల మీద ఉన్న మోజు రైతుల తిప్పలు తీర్చడంలో లేదు.. హామీలు ఏమయ్యాయని అడిగితే కుట్రలు, కుతంత్రాలకు తెర లేపుతున్నారు. కమిషన్‌ల పేరిట.. ఎంక్వైరీల పేరిట.. అరెస్టుల పేరిట అడిగే వారిని బయపెట్టాలని చూస్తున్నారు. ప్రజల దృష్టిని మరల్చాలని చూస్తున్నారు. కుంటిసాకులతో కాలక్షేపం చేస్తున్నారే తప్ప.. రైతుల కడుపు నింపే పనులు చేయడం లేదు.. రుణ మాఫీ నుంచి రైతు భరోసా దాకా రేవంత్‌ది అంతా మోసమే.. చారాణా పని కూడా చేయలేదు బారాణా ప్రచారం చేసుకుంటున్నారు. రాష్ట్రంలో రైతు వ్యతిరేక రాజ్యం నడుస్తోంది. మాఫీలు అమలు కాలేదు కానీ హామీల మాఫీ అమలవుతోందని ఎద్దేవా చేశారు.

### గ్లూ వ్యసనం వల్ల కుటుంబ సభ్యులపై
## వ్యక్తి దాడి.. వృద్ధురాలు మృతి



ముంబై: గ్లూ వ్యసనానికి బానిసైన వ్యక్తి డబ్బుల కోసం కుటుంబ సభ్యులను డిమాండ్ చేశాడు. నిరాకరించడంతో కత్తితో వారిపై దాడి చేశాడు. నానమ్మ మరణించగా తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడ్డారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లా ఈ సంఘటన జరిగింది. జిగురు పదార్థాలు, పెయింట్ థిన్నర్లలో ఉండే టౌలీన్ అనే విష రసాయనం మత్తు కలిగిస్తుంది. ఈ రసాయం వల్ల వల్ల వినికిడి లోపంతో పాటు, మూత్రపిండాలు, కాలేయం దెబ్బతింటాయి. నాడీ సంబంధిత రుగ్మతలు కలుగుతాయి. కాగా, పర్లి నగరానికి చెందిన అర్బాజ్ రంజాన్ ఖురేషి ఈ కెమికల్ గ్లూకు బానిసయ్యాడు. ఆ మత్తులో ఉన్న అతడు తన కుటుంబ సభ్యులను డబ్బులు అడిగాడు. వారు నిరాకరించడంతో కత్తితో పొడిచాడు. దీంతో నానమ్మ జుబేదా అక్కడికక్కడే మరణించింది. తీవ్రంగా గాయపడిన అతడి తల్లిదండ్రులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అర్బాజ్ రంజాన్ ఖురేషిని అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### భర్తతో గొడవ.. ముగ్గురు పిల్లలను ఒంటికి
## కట్టుకుని కాలువలో దూకిన మహిళ



భార్యాభర్తల నడుమ గొడవ నాలుగు నిండు ప్రాణాలను బలితీసుకుంది. అభం శుభం తెలియని ముగ్గురు చిన్నారులను పొట్టనపెట్టుకుంది. ఓ మహిళ తన భర్తతో గొడవపడి తన ముగ్గురు పిల్లలను తీసుకుని బయటికి వెళ్లింది. ఆ ముగ్గురిని తన ఒంటికి కట్టుకుని కాలువలో దూకి ఆత్మహత్య కు పాల్పడింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బండా జిల్లా లోని రిసౌరా గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రిసౌరా గ్రామానికి చెందిన రీనా, అఖిలేశ్ దంపతులకు ముగ్గురు సంతానం. శుక్రవారం రాత్రి భర్తతో గొడవ జరగడంతో పిల్లలను తీసుకొని ఇల్లు వదిలి వెళ్లిపోయింది. ఉదయం లేచి చూసేసరికి కోడలు, పిల్లలు కనిపించకపోవడంతో అత్తమామలు వారి కోసం వెతికారు.

చివరికి సమీపంలోని కెన్ కాలువ వద్ద వారికి సంబంధించిన దుస్తులు, గాజులు, చెప్పులు కనిపించాయి. దాంతో కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కాలువలోకి దూకి ఉండవచ్చుననే అనుమానంతో పోలీసులు ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపు ఆరుగంటలపాటు గాలించిన తర్వాత వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతుల్లో మహిళ రీనా (30), ముగ్గురు చిన్నారులు హిమాన్షు(9), అన్షి (5), ప్రిన్స్ (3)గా పోలీసులు గుర్తించారు. పిల్లలు ముగ్గురిని తల్లి తన ఒంటికి కట్టుకుని ఉంది. కాలువ నుంచి బయటికి తీసిన అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. మృతురాలి భర్త అఖిలేశ్‌ని కస్టడీలోని తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### బీజేపీపై బహిరంగ విమర్శలు..
## అధికార ప్రతినిధి బహిష్కరణ



జైపూర్: మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధంఖర్, మాజీ గవర్నర్ సత్య పాల్ మాలిక్ పట్ల బీజేపీ వ్యవహరించిన తీరును ఆ పార్టీకి చెందిన అధికార ప్రతినిధి బహిరంగంగా విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ ఆయనపై క్రమశిక్షణ చర్యలు చేట్టింది. ఆరేళ్ల పాటు బీజేపీ నుంచి బహిష్కరించింది. బీజేపీ అధికారంలో ఉన్న రాజస్థాన్‌లో ఈ సంఘటన జరిగింది. ఆ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి కృష్ణ కుమార్ జాను ఇటీవల పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధంఖర్ రాజీనామా, ఇటీవల మరణించిన మాజీ గవర్నర్, గతంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించిన సత్యపాల్ మాలిక్ పట్ల పార్టీ సీనియర్ నేతలు అవమానకరంగా ప్రవర్తించారని ఆయన ఆరోపించారు. వారిద్దరూ జాట్ వర్గానికి చెందినవారని తెలిపారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ఆఫీస్ బేరర్లను జాను ప్రశ్నించారు. 'సత్యపాల్ మాలిక్‌పై వ్యవహరించిన తీరు సమర్థనీయం కాదు. బీజేపీ నేతలు చేస్తున్నది చాలా విచారకరం' అని అన్నారు. కాగా, ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో అధికార ప్రతినిధి కృష్ణ కుమార్ జానుపై బీజేపీ క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. ఆయనను ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరించింది. జాను వ్యాఖ్యలపై వివరణ కోరుతూ జూన్ 20న షో కాజ్ నోటీసు జారీ చేసినట్లు బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ చైర్‌పర్సన్ ఓంకార్ సింగ్ లఖావత్ తెలిపారు. 'తన చర్యలను సమర్థించడంలో ఆయన విఫలమయ్యారు. ఆయనను ఆరు సంవత్సరాలు బహిష్కరించాలని కమిటీ నిర్ణయించింది' అని వెల్లడించారు.

### మాపై దాడులు చేసి, మాపైనే కేసులు పెడతారా..
### పులివెందుల ఘటనపై డీజీపీకి వైసీపీ నాయకుల ఫిర్యాదు



పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా వైసీపీ పార్టీ కార్యకర్తలు, నాయకులను భయభ్రాంతులకు గురిచేసే కుట్ర చేస్తున్నారని మాజీ మంత్రి, వైసీపీ నేత మేరుగు నాగార్జున ఆరోపించారు. ప్రజాస్వామ్యం కాపాడుతుందనే నమ్మకంతోనే వైసీపీ ఎన్నికలకు వెళ్తుందని.. కానీ మాపై దాడులు చేసి.. మాపైనే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది న్యాయమా? ధర్మమా అని ప్రశ్నించారు.స్థానిక సంస్థల ఉప ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై డీజీపీ కార్యాలయంలో వైసీపీ ప్రతినిధి బృందం ఆదివారం నాడు వినతి పత్రం సమర్పించింది. అధికార టీడీపీ పార్టీకి తొత్తులుగా మారి పోలీసులే చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నారని.. దీనిపై తక్షణమే స్పందించాలని వైసీపీ ప్రతినిధి బృందం ఆ లేఖలో కోరింది. దేశంలో ఎక్కడా చూడని విధంగా రాష్ట్రంలో పోలీసులు ఇంతగా అధికార పార్టీకి లొంగిపోయి, చట్టాలనే అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్న తీరుపై డీజీపీ స్పందించి, ప్రజాస్వామ్య రక్షణకు నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీజీపీ కార్యాలయం వెలుపల మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ.. ఈ నెల 5వ తేదీన ఎన్నికల ప్రచారం ముగించుకుని వస్తున్న ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్‌తో పాటు పలువురు నాయకులపై కర్రలు, ఇనుపరాడ్లు, రాళ్లతో పది వాహనాల్లో వచ్చిన టీడీపీ అరాచక శక్తులు దాడులకు పాల్పడ్డాయని ఆరోపించారు. ఈ దాడిపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీ వద్దకు వెళ్తే ఆయన కూడా పట్టించుకోలేదని అన్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే టీడీపీ వారికి అండగా నిలబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని పోలీసు వ్యవస్థే నీరుగారుస్తోందని ఆరోపించారు. పోలీసు యంత్రంగాన్ని చేతుల్లో పెట్టుకుని అధికార టీడీపీ చేస్తున్న అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని మేరుగు నాగార్జున విమర్శించారు. ఇటువంటి దారుణ పరిస్థితుల్లోనూ వైసీపీ శ్రేణులు ఎక్కడా భయపడకుండా ముందుకు సాగుతుంటే.. దాన్ని కూడా సహించలేక ఎవరైతే మాపై దాడులు చేశారో.. వారి నుంచే ఫిర్యాదులు తీసుకుని.. బాధితులైన వైసీపీ నాయకులు, కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లతో కేసులు నమోదు చేయడం ఈ ప్రభుత్వ అరాచకానికి, పోలీసు వ్యవస్థ దిగజారుడుతనానికి పరాకాష్టగా కనిపిస్తోందని విమర్శించారు. ఇంత అమానుషంగా చంద్రబాబు పాలన సాగుతుందని మండిపడ్డారు. దీనికి చంద్రబాబు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు.

### సిద్ధయోగి కృష్ణానంద జీ మహారాజ్‌కు
## ఘనస్వాగతం



హిమాలయాలకు చెందిన సిద్ధయోగి శ్రీశ్రీ కృష్ణానంద జీ మహారాజ్‌కు నర్సాపూర్ పట్టణంలో ఘన స్వాగతం లభించింది. తెలంగాణ రాష్ట్ర కబీర్ సేన ప్రెసిడెంట్ సంధ్యారాణి చత్రు నాయక్ ఆధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంలోని సబ్ స్టేషన్ వద్ద కృష్ణానందా జీ మహారాజ్‌కు స్వాగతం పలికారు. అనంతరం నర్సాపూర్ నుండి మండల పరిధిలోని చిప్పల్ తుర్తి సద్గురుదాం ఆశ్రమం వరకు భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ఆయన వద్ద ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కోశాధికారి రేఖ వెంకటేశం గుప్తా, సభ్యులు శ్రీనివాస్ గౌడ్, దన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### అంబులెన్స్‌కు దారి లేక..
## గర్భిణీని భుజంపై ఎత్తుకెళ్లి..



అది ఓ తండా.. అక్కడివాసులకు ఏమైనా ఎమర్జెన్సీ తలెత్తితే వారు పడే పాట్లు వర్ణణాతీతం. అందుకు నిదర్శనమే తాజాగా వెలుగులోకి వచ్చిన ఓ దృశ్యం. నాగల్ గిద్ధ సంగారెడ్డి జిల్లా నాగల్ గిద్దా మండలం మూన్యా నాయక్ తండాలో ఓ గర్భిణీ మహిళకు పురిటినొప్పులు వచ్చాయి. అయితే ఆమెను తీసుకెళ్లాలంటే మాత్రం అంబులెన్స్‌ను తీసుకురాలేని పరిస్థితి. ఎందుకంటే ఆ తండాకు కనీసం అంబులెన్స్ వెళ్లి వచ్చేందుకు కూడా దారి లేదు.

ఇలాంటి పరిస్థితుల్లో పురిటినొప్పులతో బాధపడుతున్న ఆ మహిళను చేసేదేమి లేక కుటుంబసభ్యుడు ఆమెను రెండు కిలో మీటర్ల వరకు భుజం మీద ఎత్తుకెళ్లే క్రమంలో మార్గమధ్యలో ఆ మహిళ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను వెంటనే అంబులెన్స్‌లో నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించారు. ఇక మరో మహిళకు ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండేందుకు ఆ తండాకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఈ విషయం తెలిసిన వారందరూ కోరుకుంటున్నారు.



# దోమల బెడదను

## నివారించే వంటింటి చిట్కాలు..

వర్షాకాలం వచ్చిన వెంటనే ఇళ్లలో దోమల బెడద కూడా మొదలవుతుంది. దోమలతో రాత్రుళ్లు నిద్ర ఉండదు. కుడితే దురద, మంట, జ్వరం వంటి తీవ్ర ఇబ్బందులను కలిగించడమే కాకుండా డెంగ్యూ, మలేరియా వంటి తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని కూడా పెంచుతాయి. సాధారణంగా ప్రజలు దోమలను తరిమికొట్టడానికి కాయిల్స్ లేదా ద్రవాలను ఉపయోగిస్తారు. కానీ వాటిలో ఉపయోగించే రసాయనాల కారణంగా ఇతర అనారోగాలను కొని తెచ్చుకోవాల్సి వస్తుంది.. అందుకే ప్రజలు సహజ పద్ధతులను వెతుకుతుంటారు. పాత రోజుల్లో దోమలను తరిమికొట్టడానికి వేప ఆకులతో పొగబెట్టేవారు. కానీ దానికి అలవాటు లేని వారు ఈ పొగతో సమస్యలను ఎదుర్కొంటారు. అటువంటి పరిస్థితిలో, వేపను ఎలా ఉపయోగించాలో మరిన్ని మార్గాలను ఇక్కడ తెలుసుకుందాం...ఇది దోమలను వదిలించుకోవడానికి మీకు సహాయపడుతుంది. పొగ వంటి సమస్య కూడా ఉండదు. దోమలను వదిలించుకోవడానికి ఇది సులభమైన మార్గం . మీరు కొన్ని వేప ఆకులను తీసుకొని నీటిలో బాగా మరిగించాలి. నీటి రంగు మారి ఆకులు మృదువుగా మారినప్పుడు, నీటిని చల్లబరిచిన తర్వాత ఫిల్టర్ చేయండి. ఇప్పుడు ఈ ద్రావణాన్ని స్ప్రే బాటిల్‌లో నింపి ఇంటి మూలల్లో, కర్టెన్లలు, దోమలు ఎక్కువగా కనిపించే ప్రదేశాలలో స్ప్రే చేయండి. దోమలు దాని వాసన కారణంగా పారిపోతాయి. వేప ఆకులను ఉంచడం వల్ల దోమలు ఇంట్లోకి రాకుండా నిరోధించడానికి సహజ అవరోధంగా పనిచేస్తుంది. తాజా వేప ఆకులను తీసుకొని వాటిని మెష్ చేసిన కిటికీలు, తలుపులు లేదా వెంటిలేషన్ ఉన్న ప్రదేశాలపై వేలాడదీయండి లేదా ఉంచండి. వేప వాసన దోమలు ఇంట్లోకి రాకుండా నిరోధిస్తుంది. మీకు కావాలంటే, మీరు వాటిని బాత్రూమ్ కిటికీపై కూడా ఉంచవచ్చు. వేప పేస్ట్ తయారు చేసుకుని చర్మానికి అప్లై చేసుకోవటం వల్ల చర్మాన్ని దోమల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. తాజా వేప ఆకులను గ్రైండ్ చేసి పేస్ట్ తయారు చేసుకోండి. మీకు కావాలంటే, మీరు దానికి కొంచెం కొబ్బరి నూనె కూడా యాడ్ చేసుకోవచ్చు. ఇప్పుడు ఈ పేస్ట్‌ను పడుకునే ముందు చేతులు, కాళ్ళు, మెడపై రాయండి. దీని బలమైన వాసన దోమలు మీ దగ్గరికి రానివ్వదు, ఇది పిల్లలకు కూడా సురక్షితం. పొగతో ఇబ్బంది లేకుంటే.. వేప ఆకులను కాల్చడం వల్ల ఉపయోగకరంగా ఉంటుంది. ఒక చిన్న గిన్నెలో లేదా ఏదైనా మట్టి కుండలో కొన్ని వేప ఆకులను కాల్చండి. దీనివల్ల చాలా తేలికపాటి పొగ వస్తుంది. ఇది దోమలను తరిమికొట్టడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది ఎలాంటి సమస్యను కలిగించదు. అయితే, పిల్లలు, పెంపుడు జంతువులను దాని నుండి దూరంగా ఉంచండి. ఇంట్లో దోమలను వదిలించుకోవడానికి మీరు వేప ఆకులతో తయారు చేసిన నీటితో ఫ్లోర్ క్లీన్ చేసుకోవచ్చు. మీరు స్ప్రే ద్రావణాన్ని తయారు చేసినట్లే, దానిలో నీటి పరిమాణాన్ని పెంచి చల్లబరచండి. మీరు ఇంటిని తుడుచుకున్నప్పుడు ఈ నీటిని కలపండి. ఇది దోమలు, నేలపై నివసించే గుడ్లను తొలగించడంలో సహాయపడుతుంది. వేప వాసన కారణంగా దోమలు పారిపోతాయి. మీరు కావాలనుకుంటే వేప నూనెను కూడా వాడుకోవచ్చు.

# చేతికి స్మార్ట్ వాచ్ వాడుతుంటే ఈ జాగ్రత్తలు తప్పనిసరి..



చేతికి స్మార్ట్ వాచ్ వాడుతున్నప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ముఖ్యంగా, ఛార్జింగ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి, ఎందుకంటే వాచ్ కిందపడే ప్రమాదం ఉంది. అలాగే, వాచ్ ని మణికట్టు నుండి తీసి ఛార్జింగ్ పెట్టేటప్పుడు కూడా జాగ్రత్తగా ఉండాలి. ప్రస్తుతం దాదాపు అందరి చేతికి స్మార్ట్ వాచ్ కనిపిస్తుంది. ఇందులో నడిచే అడుగులను లెక్కించడంతో పాటు హార్ట్ రేట్, స్లీప్ మోనిటర్స్ చెక్ చేసుకోవచ్చు. అలాగే మీ స్మార్ట్?ఫోన్?కి కనెక్ట్ చేసుకొని మెసేజులు చూడవచ్చు, వాట్సాప్ నోటిఫికెషన్స్ చెక్ చేయవచ్చు, కాల్స్ కూడా మాట్లావచ్చు. అయితే ఇన్ని ఫీచర్స్ ఉన్న స్మార్ట్ వాచ్ వాడకం విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. కొంతమందికి స్మార్ట్ వాచ్ వల్ల చర్మ సమస్యలు రావచ్చు. వాచ్ ని చాలా గట్టిగా కాకుండా, కొంచెం వదులుగా ఉండేలా కట్టుకోవడం మంచిది. కొందరు స్మార్ట్ వాచ్?ల నుండి వచ్చే రేడియేషన్ వల్ల తలనొప్పి లేదా వికారం లాంటి సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. అలాంటి సమస్యలు ఉంటే వాచ్?ని వాడటం తగ్గించాలి లేదా పూర్తిగా మానేయాలి. స్మార్ట్ వాచ్ వాడటం వల్ల కొందరికి నిద్రలేమి సమస్యలు వస్తున్నాయని కూడా చెబుతున్నారు. కాబట్టి, నిద్రపోయే ముందు స్మార్ట్ వాచ్?ని తీసివేయడం మంచిది. స్మార్ట్ వాచ్?లు కొన్ని నీటి నిరోధకత కలిగి ఉన్నప్పటికీ, వాటిని ఎక్కువసేపు నీటిలో ఉంచడం మంచిది కాదు. అందుకే వీటీని నీటికి దూరంగా ఉంచండి. వాచ్‌ని ఛార్జింగ్ పెట్టేటప్పుడు, అది ఎక్కువ వేడెక్కుతుందో లేదో గమనించాలి. వేడెక్కుతుంటే, ఛార్జింగ్ ఆపేయడం మంచిది. స్మార్ట్ వాచ్?లలో అనేక ఫీచర్లు ఉన్నప్పటికీ, అన్ని ఫీచర్లను ఉపయోగించకపోవచ్చు. కాబట్టి, మీకు అవసరమైన ఫీచర్లను మాత్రమే ఉపయోగించడం మంచిది. స్మార్ట్ వాచ్ కేవలం బరువు తగ్గడానికి మాత్రమే ఉపయోగపడదు. ఇది మీ ఆరోగ్యానికి సంబంధించిన అనేక విషయాలను ట్రాక్ చేస్తుంది. అయితే దీన్ని జాగ్రత్తగా వాడటం ముఖ్యం అంటున్నారు నిపుణులు. లేదంటే అనారోగ్య సమస్య పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

# పసుపు, ఆకుపచ్చ, తెలుపు...

## ఏ గుమ్మడికాయ ఆరోగ్యానికి మంచిది..?



ఆకుపచ్చ, పసుపు, తెలుపు రంగులలో ఉండే గుమ్మడికాయలన్నీ ఒకటే అయినప్పటికీ, మూడింటికి వేర్వేరు రంగులు, ఆకారాలు ఎందుకు ఉన్నాయి? సాధారణంగా మనం దీనిపై దృష్టి పెట్టము. మార్కెట్లో మనం చూసేది కొంటాము. కానీ, నిపుణుల అభిప్రాయం ప్రకారం, వివిధ రంగులు, రూపాల్లో కనిపించే ఈ కూరగాయ ఔషధ గుణాలలో కూడా భారీ వ్యత్యాసాన్ని కలిగి ఉంటుందని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మార్కెట్లో లభించే తెలుపు, పసుపు, ఆకుపచ్చ గుమ్మడికాయలు రూపాన్ని బట్టి మాత్రమే కాకుండా రుచి, లక్షణాలలో కూడా భిన్నంగా ఉంటాయి. ఈ మూడింటి మధ్య తేడా ఏమిటి..? ఎవరు ఏ గుమ్మడికాయను కొనాలి..? ప్రతి దాని ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో తప్పనిసరిగా తెలుసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే. ఒక్కో రంగు గుమ్మడి కాయలో ఒక్కో రకమైన ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉంటుందని చెబుతున్నారు. ఆయా అవసరాలను బట్టి వాటిని వాడుకోవాలని సూచిస్తున్నారు. అందుకే పసుపు, ఆకుపచ్చ లేదా తెలుపు.. ఏ గుమ్మడికాయ ఆరోగ్యానికి మంచిది? ఆకుపచ్చ, పసుపు, తెలుపు గుమ్మడికాయల మధ్య తేడా ఏమిటి అనే ప్రశ్న తరచుగా చాలా మంది మనస్సులో తలెత్తుతుంది. గుమ్మడికాయలు అయినప్పటికీ, మూడింటికి వేర్వేరు రంగులు, ఆకారాలు ఎందుకు ఉన్నాయి? సాధారణంగా మనం దీనిపై దృష్టి పెట్టము. మార్కెట్లో మనం చూసేది కొంటాము. కానీ, నిపుణుల అభిప్రాయం ప్రకారం, వివిధ రంగులు, రూపాల్లో కనిపించే ఈ కూరగాయ ఔషధ గుణాలలో కూడా భారీ వ్యత్యాసాన్ని కలిగి ఉంటుందని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మార్కెట్లో లభించే ఆకుపచ్చ గుమ్మడికాయ తక్కువగా పండిందని అంటున్నారు. ఆకుపచ్చ, గుండ్రని గుమ్మడికాయ రకం పసుపు, పొడవైన గుమ్మడికాయ కంటే కొద్దిగా భిన్నంగా ఉంటుంది. దీని రుచి కూడా కొద్దిగా భిన్నంగా ఉండటానికి ఇదే కారణం. పసుపు గుమ్మడికాయ పరిమాణంలో చాలా పెద్దది. కొంచెం పొడవుగా ఉంటుంది. సాంకేతికంగా, ఇది ఆకుపచ్చ గుమ్మడికాయ పండిన రూపం. ఇది పండిన తర్వాత ముదురు పసుపు లేదా నారింజ రంగులోకి మారుతుంది. ఇది రుచిలో కొద్దిగా తీపిగా ఉంటుంది. తెల్ల గుమ్మడికాయ విషయానికొస్తే, దీనిని హిందీలో పెథా అని, ఇంగ్లీషులో ఆష్ గార్డ్ అని పిలుస్తారు.


ఇది కూడా కొంచెం గోరింటాకులా కనిపిస్తుంది. ఆకుపచ్చ, పసుపు గుమ్మడికాయ కంటే తెల్ల గుమ్మడికాయలో ఎక్కువ పోషకాలు ఉంటాయి. ఆయుర్వేదచార్య ప్రకారం, విటమిన్ ఎ, విటమిన్ బి6, విటమిన్ సి, విటమిన్ ఇ, మెగ్నీషియం, భాస్వరం, ఐరన్, ఫోలేట్, నియాసిన్, థియామిన్ వంటి పోషకాలు తెల్ల గుమ్మడికాయలో మంచి పరిమాణంలో కనిపిస్తాయి. అందుకే పసుపు, ఆకుపచ్చ గుమ్మడికాయ కంటే తెల్ల గుమ్మడికాయ ఎక్కువ ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది.

# ఈ హెయిర్ ప్యాక్స్‌తో చుండ్రు సమస్యకి ఫుల్ స్టాప్



ప్రస్తుతకాలంలో చుండ్రు సమస్య సర్వసాధారణం అయిపోయింది. దీనికి కారణం మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు కావచ్చు. చుండ్రు సమస్య తీవ్రమైతే జుట్టు రాలడానికి కారణం అవుతుంది. ఉందుకే దీని ముందే తగ్గించుకోవాలని అంటున్నారు నిపుణులు. నిమ్మరసం, కొబ్బరి నూనె: 2-3 చెంచాల కొబ్బరి నూనెను వేడి చేసి, సమాన మొత్తంలో నిమ్మరసంతో కలపండి. దీన్ని మీ తలకు పట్టించి, 30 నిమిషాలు లేదా అంతకంటే ఎక్కువసేపు ఉంచండి. తర్వాత షాంపూతో తలస్నానం చేయండి. నిమ్మరసం చుండ్రును తగ్గించడంలో సహాయపడుతుంది. కొబ్బరి నూనె మీ జుట్టును తేమగా ఉంచుతుంది. దీంతో చుండ్రు సమస్య దూరం అవుతుంది. అరటిపండు, తేనె, నిమ్మకాయ: అరటిపండు, తేనె, నిమ్మకాయ కలిపి ఒక మిశ్రమాన్ని తయారు చేయండి. దీన్ని మీ తలకు పట్టించి, 30 నిమిషాల తర్వాత కడిగేయండి. అరటిపండు చుండ్రును తగ్గిస్తుంది. అలాగే జుట్టును మృదువుగా చేస్తుంది. తద్వారా వెంట్రుకలు రాలడం కూడా తగ్గి జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వేప: వేపాకులను మెత్తగా నూరి, పేస్ట్ లా చేసి తలకు పట్టించండి. 15-20 నిమిషాల తర్వాత తలస్నానం చేయండి. వేపలో యాంటీ-ఫంగల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి చుండ్రును తగ్గించడంలో సహాయపడతాయి. ఇలా కొన్నిరోజులు చేస్తే మీ జుట్టు చుండ్రు పూర్తిగా తగ్గి ఆరోగ్యంగా ఉంటుంది. మెంతులు: మెంతులను రాత్రంతా నానబెట్టి, ఉదయానికి మెత్తగా రుబ్బుకోవాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి, 30 నిమిషాల తర్వాత కడిగేయండి. మెంతులు చుండ్రును తగ్గించడంలో సహాయపడతాయి. జుట్టు రాలడాన్ని కూడా తగ్గిస్తాయి. దీంతో కుదుళ్ళ బలపడి జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.

# వానాకాలం కళ్ళు ఆరోగ్యంగా ఉండాలంటే..



వర్షాకాలంలో కంటి సంబంధిత సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలాంటి సమయంలో ముందుగానే కొన్ని రెమెడీస్ తీసుకోవడం మంచిది. ఇలా చేయడం వల్ల వర్షం వేళ మీ కళ్ళు ఆరోగ్యంగా ఉంటాయి. కంటి సమస్యలు కూడా దూరం అవుతాయని నిపుణులు అంటున్నారు. వర్షాకాలంలో సూక్ష్మక్రిములు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, చేతులు తరచుగా కడుక్కోవడం, కళ్ళు తుడుచుకోవడానికి శు భ్రమైన వస్త్రం ఉపయోగించడం ముఖ్యం. ఈ కాలంలో కంటి ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. కళ్ళు దురదగా అనిపిస్తే లేదా ఎర్రగా మారితే, వెంటనే వైద్యుడిని సంప్రదించండి. కంటి చుక్కల మందులు లేదా ఇతర కంటి సంబంధిత మందులను వాడే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవడం చాలా ముఖ్యం. కంటి అలంకరణ వస్తువులను ఇతరులతో పంచుకోవడం వల్ల ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, మీ కంటి అలంకరణ వస్తువులను ఎవరితోనూ పంచుకోవద్దు. కళ్ళజోడు లేదా కాంటాక్ట్ లెన్స్‌లను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. లందంటే వర్షం కారణం వాటిపై సూక్షమక్రిములు చేరి కంటి ఆరోగ్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది. కుదిరితే కాంటాక్ట్ లెన్స్ పెట్టుకున్నప్పుడు చేతులకు గౌజులు వాడటం మంచిది. కళ్లపై భారంగా ఉన్నట్లయితే ఓ గుడ్డను గోరువెచ్చని నీటిలో ముంచి కాళ్లపై మెల్లగా మసాజ్ చెయ్యండి. ఇలా చేస్తున్నప్పుడు కళ్లు మూసుకుని ఉండేలా చూసుకోండి. దీనితో పాటు, మీరు కళ్లలో పొడిబారినట్లు అనిపిస్తే, వాటిని రిఫ్రెష్ చేయడానికి డాక్టర్ సలహా మేరకు కళ్లలో రోజ్ వాటర్ లేదా ఐ డ్రాప్స్ ఉపయోగించవచ్చు. కంటికి సంబంధించిన ఏవైనా సమస్యలు వస్తే, వెంటనే వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. లేదంటే ఇవి తీవ్రమై కంటి చూపుపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అందుకే సమస్యను ముందే గుర్తించి చికిత్స తీసుకొని జాగ్రత్త పడటం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

# స్పెషల్ మక్కజొన్న రెసిపీలు..!

వర్షాకాలం వచ్చిందంటే చాలు.. వేడి వేడి టిఫిన్లు, స్నాక్స్ తినాలని ప్రతి ఒక్కరికీ అనిపిస్తుంటుంది. ముఖ్యంగా మక్కజొన్నతో తయారయ్యే వంటకాలు ఈ సీజన్ లో చాలా స్పెషల్ గా ఉంటాయి. హెల్త్, టేస్ట్ రెండూ కలిపి ఇచ్చే ఈ మక్కజొన్న రెసిపీలు మీకు నచ్చే తీరుతాయి. మసాలా కార్న్.. కొద్ది సేపటిలో సులభంగా తయారయ్యే ఒక హాట్ అండ్ స్పైసీ స్నాక్ ఇది. ఉడికించిన మక్కజొన్న గింజల్లో బటర్ వేసి కొద్దిగా నిమ్మరసం పిండి చాట్ మసాలా, కారం జతచేస్తే చాలు.. టేస్టీగా, వేడిగా సిద్ధం అవుతుంది. వర్షం పడుతుండగా ఓ కప్పు టీతో కలిసి తినడానికి చాలా బాగుంటుంది. మక్కజొన్న పకోడీ .. వర్షంలో వేడి వేడి పకోడీలే అదిరిపోయే కాంబినేషన్. మక్కజొన్న ముద్ద, ఉల్లిపాయ ముక్కలు, శనగపిండి, మిర్చి, ఉప్పు వంటి మసాలాలతో కలిపి ఆయిల్లో డీప్ ఫ్రై చేయాలి. గోధుమ రంగులో క్రిస్పీగా వస్తే ప్లేట్ లో వేసుకుని టీతో కలిసి తింటే చిరుతిండికి పర్ఫెక్ట్ చాయిస్ ఇది. స్వీట్ కార్న్ సూప్.. ఇదొక ఇండియన్ టచ్ ఉన్న చైనీస్ సూప్. మక్కజొన్నతో పాటు క్యారెట్, బీన్స్, మిరియాల పొడి వంటివి వేసి మరిగించి వేడి వేడి సూప్ తయారు చేస్తారు. చల్లదనాన్ని పోగొట్టే ఈ సూప్ వర్షాకాలంలో శరీరానికి వెచ్చదనం ఇస్తుంది. హెల్దీగా, లైట్‌గా ఏదైనా తాగాలనిపిస్తే ఇదే బెస్ట్. కార్న్ భేల్ .. ఇది వీధిలో దొరికే భేల్‌కు ఆరోగ్యవంతమైన ప్రత్యామ్నాయం. ఉడికించిన మక్కజొన్నలో ఉల్లిపాయలు, టమాటాలు, కొంత నిమ్మరసం, తక్కువ మిరియాల పొడి, కొంచెం చట్నీలు కలిపితే హెల్తీ అండ్ టేస్టీ స్నాక్ రెడీ అవుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది మంచి ఆప్షన్. కార్న్ చీజ్ టోస్ట్.. ఈ టోస్ట్ పిల్లలకే కాదు.. పెద్దవాళ్లకూ నచ్చే టైప్. ఉడికించిన మక్కజొన్నను చీజ్‌తో కలిపి కొంచెం మిరియాల పొడి, ఉప్పు, హర్బ్స్ వేసి బ్రెడ్ పై వేసి గ్రిల్ చేస్తే.. గోల్డెన్ టోస్ట్ తయారవుతుంది. ఇది ప్రొటీన్, కార్బోహైడ్రేట్స్ పరంగా పుష్కలంగా పోషకాలు



అందించేది కూడా. బ్రేక్ ఫాస్ట్ కు లేదా సాయంత్రం స్నాక్ కు పర్ఫెక్ట్ రెసిపీ ఇది.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో శివసేన పోటీ చేస్తుంది

**శివసేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ గౌట్ గణేష్**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో శివసేన (ఉద్ధవ్ బాలసాహేబ్ ఠాక్రే) పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ గౌట్ గణేష్ అన్నారు. ఆదివారం నారాయణగూడ లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను పార్టీ తరపున పోటీలో నిలుపుతామని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అవినీతి లేని సమాజం కోసం యువత, విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలని ఆయన సూచించారు. శివసేన పార్టీలో యువతకు, మహిళలకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గోశామహల్ ప్రాంతానికి చెందిన రాధిక తన అనుచరులతో కలిసి శివసేన (యుబిటి) పార్టీలో చేరారు. ఆమెకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల సాహెబ్ ఠాక్రే స్థాపించిన శివసేన పార్టీలో చేరడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మహిళలు రాజకీయాల్లో రావాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పూస శ్రీనివాస్, సుదర్శన్, మహేష్ కుమార్, ఠాకూర్ వికాస్ సింగ్, వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి.. కిషన్ రెడ్డి



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కాచిగూడ లోని జివిఆర్ కరాటే అకాడమీ ద్వారా పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను ఆదివారం కేంద్రమంత్రి అభినందించారు. కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి ఎస్ గోపాల్ రెడ్డి, అమృత రెడ్డి, ఘన సంతోషిని రెడ్డి, వెంకట్ రెడ్డి, అన్విత్ పటేల్, గీతేష్, నవీన్ పాల్గొన్నారు.

## చదువును మించిన ఆస్తులు లేవు: నామాల యాదగిరి

- కష్టపడితే ఏదైనా సాధించవచ్చు
- యువత తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకండి



**ఉప్పల్ ( ప్రశ్న న్యూస్)** రామంతపూర్ డివిజన్ గాంధీనగర్ నివాసి నామాల యాదగిరి సరూర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో అసిస్టెంట్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ మున్సిపల్ ఉప  కమిషనర్ గా పదవి  ఉన్నత ని పొందిన సందర్భంగా రాజేంద్రనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు రుద్రారం నరసింహ , బండారి బిక్షపతి, హైకోర్టు న్యాయవాది కోంద్రోన్ పల్లి గిరిబాబు మాట్లాడుతూ యాదగిరి  చిన్నప్పటి నుంచి కష్టపడే స్వభావి దళిత సామాజిక వర్గంలో వారు ఉన్నత విద్యని అభ్యసించి ఎన్నో అవరోధాలు వచ్చినప్పటికీ వాటి అన్నిటిని జయిస్తూ ఈరోజు ఈ స్థాయికి రావడం ఎంతో సంతోషంగా ఉందని వారి కష్టం వారి త్యాగం ఎంతగానో యువతకి స్ఫూర్తి అని అన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ డిప్యూటీ ఉప కమిషనర్ నామాల యాదగిరి మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న చదువు కుంటున్న విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఎడల దృష్టికి తీసుకువస్తే చదువుకి నిధుల ఆటంకాలు ఉంటే దృష్టికి తీసుకు వచ్చిన కాలేజ్ ఫీజు, ట్యూషన్ ఫీజు, వంటివి తన బాధ్యతగా తీసుకుంటానని ఈ సందర్భంగా తెలిపారు. యువత తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని తల్లితండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివితే అనుకున్నది సాధిస్తామని చదువు ఉన్నత స్థాయికి తీసుకుపోతుందని చదువు ఉంటే అన్నీ ఉన్నట్టే అని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమం లో రాజేంద్రనగర్ సంక్షేమ సంఘం సభ్యులు కొమ్ము ప్రవీణ్, పోకల మహేష్, నామాల శ్రీనివాస్, చేగోరి శ్రీనివాస్, యనమల రాకేష్, దొడ్డి జంగయ్య, కొమ్ము ప్రశాంత్, కొమ్ము వినీల్, జగదీష్, కార్తీక్, మరియు కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో ఐ టి ఆర్  దాఖలు చేయండి: వెంకట్ టాక్స్ కన్సల్టెంట్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పన్ను చెల్లింపుదారులు సెప్టెంబర్ 15వ తేదీలోపు ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయాలి. ఏదైనా సందర్భంలో గడువు తేదీకి ముందే మీ ఐటీఆర్‌లను దాఖలు చేయండి. లేకుంటే మీరు పన్ను వాపసు ప్రయోజనాన్ని కోల్పోవడమే కాకుండా, జరిమానా మరియు వడ్డీని కూడా ఆకర్షిస్తారు.దాఖలు చేసేటప్పుడు మనం తప్పు ఐటీఆర్ ఫారమ్‌ను ఎంచుకోకూడదు. మనం అన్ని ఆదాయ వనరులను పేర్కొనాలి. పాటించకపోతే తరువాత లోపభూయిష్ట నోటీసు అందుతుంది.తగ్గింపులు మరియు మినహాయింపులను క్లెయిమ్ చేసేటప్పుడు మనం పన్ను ఆదా పెట్టుబడుల వివరాలను పేర్కొనాలి. పన్ను చెల్లింపుదారులు రాజకీయ విరాళాలు, దాతృత్వ విరాళాలు, విద్యా రుణాలు మరియు వైకల్యం వంటి తప్పుడు తగ్గింపులను రుజువులు లేకుండా క్లెయిమ్ చేస్తే, నోటీసు అందుకోవడానికి గరిష్ట అవకాశం ఉంటుంది మరియు తరువాత నవీకరించబడిన ఐటీఆర్‌ను జరిమానా, వడ్డీ మరియు జరిమానాతో తప్పుగా క్లెయిమ్ చేయబడిన పన్ను చెల్లించి దాఖలు చేయాల్సి ఉంటుంది.పన్ను చెల్లింపుదారులకు ఐటీఆర్ దాఖలు చేసే ప్రక్రియ తెలియకపోతే, నిపుణుడిని సంప్రదించడం ఎల్లప్పుడూ మంచిది. వెంకట్ (టాక్స్ కన్సల్టెంట్), ఫోన్: 8885675574, టీవీఎన్ టాక్స్ కన్సల్టెన్సీ, హైదరాబాద్.

# నేను వేసిన బిచ్చంతోనే కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు: గువ్వల బాలరాజ్

**- కేటీఆర్ మొదటిసారి గెలిచినప్పుడు కేవలం 300 ఓట్లు అధికం, నాకన్నా బచ్చా కాదా.?**

**- బిజెపిలో చేరడానికి చాలామంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రెడీగా ఉన్నారు**





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాజకీయాలలో శాశ్వతమైన స్థానాలు ఎవరికీ ఉండవు. అప్పటిదాకా ఆ పార్టీలో ఉన్నవారు వేరే పార్టీలోకి వెళ్లొచ్చు. వేరే పార్టీలో ఉన్నవాళ్లు ఇతర పార్టీలోకి వెళ్లొచ్చు. అదేదో సినిమాలో చెప్పినట్టు రాజకీయాలు అనేవి మయసభ లాంటివి, స్థానాలు శాశ్వతం కాదు, వ్యక్తులకు పదవులు స్థిరం కాదు. రాజకీయాలు శాశ్వతమైనవి.. పార్టీలలో స్థానాలు తాత్కాలికమైనవని మరోసారి నిరుపితమైంది. తెలంగాణ రాష్ట్రంలో గతంలో అచ్చంపేట స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు గువ్వల బాలరాజు. అప్పట్లో సంచలనం సృష్టించిన ఫామ్హౌస్ వ్యవహారంలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే కీలకంగా ఉన్నారు. ఆ వ్యవహారం జరనన్ని రోజులు గువ్వల బాలరాజు ప్రగతి భవన్ కు పరిమితమయ్యారు. అప్పట్లో ఆ వ్యవహారం మొత్తం కేసీఆర్ నడిపిన డ్రామా అని తనకు సంతోష్ అంటే ఎవరో తెలియదని బాలరాజు ఇటీవల కుండబద్దలు కొట్టారు. అంతేకాదు తనతో పాటు చాలామంది కాషాయ కండువా కప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. దానికి తగ్గట్టుగానే బాలరాజు ఆదివారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు సమక్షంలో బిజెపిలో చేరారు. బిజెపిలో చేరిన తర్వాత బాలరాజు సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా తనను ఇటీవల ఉద్దేశించి భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు బచ్చాగాడు అని చేసిన వ్యాఖ్యలపై బాలరాజు స్పందించారు. నేను ఆకలి కేకలను వినిపించడం మొదలుపెడితే కల్వకుంట్ల తారక రామారావు గ్రామాలలో తిరగలేడు. నాకంటే ఆయన పెద్దోడు కాదు. ఆయన ఎదిగిన సామాజిక వర్గం నుంచి వచ్చారు. అమెరికాలో చదువుకున్నారు. ఆయనకున్న నైపుణ్యాలు నాకు లేకపోవచ్చు. ఆయనలాగా ఆకట్టుకునే విధంగా నేను ప్రసంగాలు చేయలేకపోవచ్చు. కానీ నేను చూసిన ఆకలి మంటలు ఆయన చూడలేదు. నా అంత అనుభవం ఆయనకు లేదు. ఆయన తొలిసారి ఎన్నికల్లో గెలిచినప్పుడు 300 ఓట్ల మెజారిటీ మాత్రమే సాధించారు. అలా అయితే ఆయనే బచ్చాగాడు కదా, ఆ మాత్రం దానికి ఆయనకేదో విపరీతమైన అనుభవం ఉన్నట్టు మాట్లాడితే ఎలా కుదురుతుందని" బాలరాజు విమర్శించారు. గులాబీ దళపతిని ఉద్దేశించి కూడా బాలరాజు సంచలన వ్యాఖ్యలు చేశారు. కెసిఆర్ రెండుసార్లు ముఖ్యమంత్రి అవ్వడానికి కారణం నేనే. మేము వేసిన బిచ్చంతోనే ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన ఆరోజు తెలంగాణ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర జరుగుతుందని చెప్పారు. నేను నిన్ను నమ్మాను.. అందువల్ల ఈ టాస్క్ ఇస్తున్నానని నాతో అన్నారు. దానికి నేను సరే అన్నాను. ఫామ్ హౌస్ ఎపిసోడ్ గురించి చెబితే సరే అన్నాను. ఆ తర్వాత కేసీఆర్ చెప్పినట్టు చేశానని" బాలరాజు పేర్కొన్నారు.

# రాబోయే స్థానిక ఎన్నికల్లో పూర్తిస్థాయిలో పోటీకి సీపీఐ సిద్ధం

- రోడ్డు వెడల్పు పనుల్లో నిర్లక్ష్యం - ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
- 8 గంటల పని విధానం అమలు చేయాలి
- సీపీఐ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి : కడారి రాములు డిమాండ్
- మహాసభ పోస్టర్ ఆవిష్కరణ - బీజేపీపై సీపీఐ తీవ్ర విమర్శలు

**వేములవాడ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్‌లో జరగనున్న సీపీఐ రాష్ట్ర 4వ మహాసభ పోస్టర్‌ను ఆదివారం వేములవాడలో సీపీఐ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి కడారి రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలను 29కి కుదించి, వాటిని 4 కోడ్‌లుగా మార్చడం ద్వారా కనీస వేతనాల చట్టం, సమ్మె హక్కు వంటి కీలక హక్కులను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

### కడారి రాములు ప్రధాన డిమాండ్లు

- 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలి.
- శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వాలి.
- ఆసరా పెన్షన్ పెంపు హామీ అమలు చేయాలి.
- పావలా వడ్డీ రుణాలు, రేషన్ కార్డులు, డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలి.
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణదారులకు రూ.5 లక్షలు పూర్తిగా ఇవ్వాలి.
- ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ రైతుల భూములను తిరిగి వారికి అప్పగించాలి.



వేములవాడలో రోడ్ వెడల్పు పనులు మట్టి తొలగించకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇద్దరి చేతులు విరిగిన ఘటనలు చోటు చేసుకున్నాయని తెలిపారు. రాత్రి వీధి దీపాలు లేక మహిళలు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ ఎంపీటీసీ, జడ్పీటీసీ,సర్పంచులు,వార్డు మెంబర్లు,కౌన్సిలర్ స్థానాల్లో సీపీఐ పార్టీ పూర్తిస్థాయిలో పోటీ చేస్తుందని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ కార్యదర్శి ఎల్ల దేవరాజు,గాజుల పోశెట్టి, కోరేపు క్రాంతి, కోరేపు శ్రీను, పెంట శ్రీను,తాటికార్ల ఎల్లయ్య, పెంట లింగం, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నా చెల్లెల అనుబంధం కలకాలం ఉండాలి: జూలూరి కావ్య శ్రీ



**అంబర్ పేట (ప్రశ్న న్యూస్)** అన్నా చెల్లెల అనుబంధం కలకాలం ఉండాలని నేను నీకు రక్ష నువ్వు నాకు రక్ష అనే విధంగా రాఖీ పండుగను జరుపుకుంటున్నామని జూలూరి కావ్య శ్రీ అన్నారు. ఈ సందర్భంగా పోలోజు వరుణ్ కు రక్షాబంధన్ చేస్తున్న జూలూరు కావ్య శ్రీ, అక్కినపల్లి  నైనా శ్రీ, పోలోజు వకులేశ్వరి ఒకరికి ఒకరు తోడుగా కలకాలం ఉండాలని ఈ సందర్భంగా అన్నారు.

## ఏడుపాయలలో భక్తుల సందడి

పాపన్నపేట : పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వేసవి సెలవులు, ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో పుణ్యక్షేత్రం కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో చంద్రశేఖర్, సిబ్బంది సూర్య శ్రీనివాస్, బ్రహ్మాచారి, ప్రతాపరెడ్డి, బత్తిని రాజు, వారుణాచారి, నర్సింలు, నరేష్, యాదగిరి తదితరులు తగిన ఏర్పాట్లు చేశారు. పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తగిన బందోబస్తు చర్యలు చేపట్టారు.

## బీహార్ డిప్యూటీ సీఎంకు రెండు ఓటరు కార్డులు

**- తేజస్వి యాదవ్ ఆరోపణ**





పాట్నా: బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ వివాదం కొత్త మలుపు తిరిగింది. బీజేపీ నేత, డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హాకు రెండు ఓటరు కార్డులున్నాయని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు. దీనికి సంబంధించిన ఆధారాలను మీడియా ముందు బయటపెట్టారు. ఉప ముఖ్యమంత్రి సిన్హాకు వేర్వేరు అసెంబ్లీ సెగ్మెంట్లలో రెండు ఎపిక్ నంబర్లు ఉన్నాయని ఆరోపించారు. ఈ రెండు ఓటరు కార్డుల్లో ఆయన వయస్సు కూడా భిన్నంగా ఉన్నదని విమర్శించారు. బంకిపూర్ సెగ్మెంట్‌లో ఉన్న ఓటరు కార్డులో 60 ఏళ్ల వయస్సు, లఖిసరాయ్‌లోని ఓటరు కార్డులో 57 ఏళ్ల వయస్సు ఉన్నదని తెలిపారు. 'ఈ రెండు ఎపిక్ నంబర్‌ల జారీకి సంబంధించిన పత్రాలపై ఆయన సంతకం చేసి ఉండాలి లేదా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ మొత్తం మోసపూరితమైనది' అని ఆరోపించారు. ఈ మోసానికి పాల్పడిన సిన్హాపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, తేజస్వి యాదవ్ ఆరోపణలను డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హా ఖండించారు. తన కుటుంబం గతంలో బంకిపూర్ అసెంబ్లీ ప్రాంతంలో నివసించిందని తెలిపారు. దీంతో అక్కడి ఓటరు జాబితా నుంచి తన పేరును తొలగించాలని కోరుతూ ఫారమ్ నింపినట్లు చెప్పారు. లఖిసరాయ్ ఓటరు జాబితాలో తన పేరును చేర్చినట్లు వివరించారు. 'జంగిల్ రాజ్ యువరాజు మోసం చేస్తాడు. మేం అలాంటి చర్యలకు పాల్పడం. దురదృష్టవశాత్తు రాజ్యాంగ పదవిలో ఉన్న ఒకరు సరైన జ్ఞానం లేకుండా రాజకీయాలను దుర్వినియోగం చేస్తున్నారు' అని తేజస్వి యాదవ్‌పై ఆయన మండిపడ్డారు.

## పులివెందుల జడ్పీటీసీ ఎన్నిక.. 550 మందిపై బైండోవర్ కేసులు

జడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో పులివెందులలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పులివెందుల నియోజకవర్గంలో ఐదు పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటన్నింటినీ సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఇక ఒంటిమిట్టలో 17 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. అందులో 4 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నాయని పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో జడ్పీటీసీ ఎన్నికల కోసం పోలీసులు భారీగా బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు పులివెందులలో 550 మందిపై బైండోవర్ కేసులు నమోదయ్యాయి. పులివెందుల, ఒంటిమిట్టలో ఉప ఎన్నిక నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని కడప జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. రెండు ప్రాంతాల్లో 1100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పులివెందులలో ఇప్పటికే 550 మందిపై బైండోవర్ కేసులు పెట్టామని తెలిపారు. అనుమానిత వ్యక్తులపై పోలింగ్ రోజు గృహ నిర్బంధం చేస్తామని పేర్కొన్నారు. మీడియాపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచుతామని చెప్పారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ సందర్భంగా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. ఇవాళ సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియనుండటంతో.. 5 గంటల తర్వాత నుంచి స్థానికేతరులు గ్రామాల్లో ఉండటానికి వీల్లేదని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.




# పరదా ట్రైలర్ విడుదల..

## కథపై మరింత ఆసక్తిని పెంచారుగా..!

అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం పరదా ఆగస్టు 22న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే టీజర్‌తో ఆసక్తి రేపిన చిత్ర బృందం తాజాగా ట్రైలర్ విడుదల చేసింది. ట్రైలర్ చూస్తేనే కథలోని గంభీరత, సంఘర్షణ స్పష్టంగా కనిపిస్తోంది. ఈ చిత్రం ఓ గ్రామంలో పాత సంప్రదాయాల పేరుతో ఉన్న దురాచారాల నేపథ్యంలో సాగుతుంది. ఆ గ్రామంలో ఆడపిల్లలు బయటకు మొహం చూపించకుండా, పరదా కట్టుకొని జీవించాల్సిన పరిస్థితి. అటువంటి సమాజంలో ఎదిగిన సుబ్బు పాత్రలో అనుపమ కనబడతారు. ఆ గ్రామంలో ఇంకెన్ని దురాచారాలు ఉన్నాయి? వాటిని సుబ్బు ఎలా ఎదుర్కొంది అనేది చిత్ర కథగా తెలుస్తుంది. ఈ ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకునే ఎమోషన్‌తో పాటు ఇంట్రెస్టింగ్ కథతో ఉండడం సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఆచారాల ముసుగులో నలిగిపోతున్న మహిళ తన గ్రామం నుంచి తప్పించుకోవడం, ఆమెకు మరో ఇద్దరు మహిళలు తోడు కావడం.. వారి ద్వారా తన నిజమైన జీవితాన్నిఎలా కనుగొంది అనేది చిత్రంలో ఆసక్తిగా చూపించనున్నట్లు తెలుస్తుంది. ఇలాంటి గుడ్ ఫీల్ కాన్సెప్టులని ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తూ ఉంటారు. ఇక ఇలాంటి కథకి అనుపమ పరమేశ్వరన్ తోడు కావడంతో సినిమా సూపర్ హిట్ అవుతుందని అంటున్నారు. ఈ సినిమాలో మలయాళ బ్యూటీ దర్శన రాజేంద్రన్, సంగీత ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. గోపి సుందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను ఆగస్టు 22న రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. ఈ చిత్రానికి ప్రవీణ్ కాంద్రేగుల దర్శకత్వం వహిస్తున్నారు. అనుపమతో పాటు సంగీత , ఇతర మహిళా పాత్రలు కథలో కీలకంగా ఉంటాయని ట్రైలర్ చూస్తే తెలుస్తోంది. దర్శకుడు వీటిని బలంగా డిజైన్ చేసినట్టు స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఇది సమాజానికి సందేశాన్ని ఇచ్చే చిత్రంగా నిలవనుంది. ఆసక్తికరమైన అంశం ఏమంటే, దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ కూడా సినిమాలో ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించబోతున్నారు. అయితే, ఆయన పాత్రకు సంబంధించిన వివరాలు ఇంకా బయటకు రాలేదు, అది సస్పెన్స్‌గా ఉంచారు. గోపీ సుందర్ అందించిన నేపథ్య సంగీతం ట్రైలర్‌కు మంచి బలాన్నిచ్చింది. విజువల్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. కథ, మేకింగ్ పరంగా సినిమాకు మంచి కంటెంట్ ఉంది. ఇప్పటికే చిత్రబృందం ప్రమోషన్స్ ప్రారంభించింది. పబ్లిసిటీపై మరింత ఫోకస్ పెడితే, ఈ సినిమాను థియేటర్లకు మరింత మంది ప్రేక్షకులు ఆకర్షించే అవకాశం ఉంది.

# నా సక్సెస్ వెనుక రహస్యం అదే..

## అసలు విషయం చెప్పిన రష్మిక



పాన్-ఇండియా స్టార్‌గా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటి రష్మిక మందన్న, ఇంతటి కీర్తి ప్రతిష్టల మధ్య కూడా తనను తాను ఎలా ప్రశాంతంగా ఉంచుకుంటారో వెల్లడించారు. నిరంతర ప్రయాణాలు, షూటింగ్‌ల హడావుడిలో తన మానసిక ప్రశాంతతకు, వాస్తవానికి దగ్గరగా ఉండటానికి ఒక అలవాటు ఎంతగానో సహాయపడుతుందని ఆమె తెలిపారు. ఆ అలవాటే రోజూ డైరీ రాసుకోవడం అని ఆమె అన్నారు. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, "నా చుట్టూ ఉన్న మనుషులే నా బలం. నా కుటుంబం, స్నేహితులు, నా టీమ్ నాకు అండగా నిలవడమే కాకుండా, నేను ఎక్కడి నుంచి వచ్చానో గుర్తుచేస్తూ నన్ను నేల మీద నిలబెడతారు" అని తెలిపారు. అభిమానుల గురించి ప్రస్తావిస్తూ, "నేను చేసే పనిని గుర్తుచేస్తూ, మరింత ఉత్తమంగా పనిచేయడానికి నా అభిమానులు ఇచ్చే ప్రోత్సాహం ఎనలేనిది" అని ఆమె చెప్పారు. అయితే, కొన్నిసార్లు ఈ హడావుడి నుంచి కాస్త విరామం తీసుకోవడం చాలా అవసరమని రష్మిక అన్నారు. "కొన్ని రోజులు నాకు నేనే కాస్త ఆగమని, అన్ని విషయాల గురించి ఆలోచించుకోమని చెప్పుకుంటాను. అలాంటి సమయంలో డైరీ రాసుకోవడం నాకు బాగా ఉపయోగపడుతుంది. నా చుట్టూ ఏం జరుగుతున్నా, నా లోపల ఏం జరుగుతుందో తెలుసుకునే ప్రయత్నం చేస్తాను. నేను స్థాపించిన 'డియర్ డైరీ' వెనుక ఉన్న ఉద్దేశం కూడా ఇదే" అని ఆమె వివరించారు. ఇక సినిమాల విషయానికొస్తే, రష్మిక త్వరలో 'ది గర్ల్‌ఫ్రెండ్' అనే తెలుగు చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. గీతా ఆర్ట్స్ 2 పిక్చర్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా టీజర్ గత ఏడాది డిసెంబర్‌లో విడుదలై ఆసక్తిని రేకెత్తించింది. దీంతో పాటు ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వంలో ఆయుష్మాన్ ఖురానాతో కలిసి 'థమా' అనే హిందీ చిత్రంలో కూడా నటిస్తున్నారు.

# నా ఆత్మ విశ్వాసంపై దెబ్బ



యష్‌రాజ్ ఫిల్మ్స్ సీరియర్ కాస్టింగ్ డైరెక్టర్ షానూ శర్మ.. తన ఆత్మవిశ్వాసంపై దెబ్బ కొట్టిందంటూ మీర్జాపూర్ నటి ఇషా తల్వార్ ఆరోపిస్తున్నది. ఆడిషన్స్ సందర్భంగా తనను ఇబ్బంది పెట్టేలా వ్యవహరించిందంటూ చెప్పుకొచ్చింది. ఇందుకు సంబంధించి.. తన అనుభవాన్ని 'ఇన్‌స్టా'లో పంచుకున్నది. షానూ శర్మ.. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్స్‌లో సీనియర్ కాస్టింగ్ డైరెక్టర్‌గా చాలా ఏళ్లుగా పనిచేస్తున్నది. ఎంతోమంది కొత్తవారి ప్రతిభను వెలికితీసి.. బీటౌన్‌కు అందించింది. రణ్‌వీర్ సింగ్, అనుష్క శర్మ, భూమి పెడ్నేకర్ లాంటి సీనియర్ నటులను బాలీవుడ్‌కు పరిచయం చేసింది. తాజాగా, 'సయ్యార' స్టార్లు అహాన్ పాండే, అనీత్ పడ్డాలనూ వెలుగులోకి తీసుకొచ్చింది. అయితే, తన విషయంలో మాత్రం షానూ శర్మ నెగెటివ్‌గా ప్రవర్తించిందంటూ ఇషా తల్వార్ చెబుతున్నది. 'ఒక సినిమాకు సంబంధించి.. షానూ శర్మ నాకు ఆడిషన్ నిర్వహించింది. స్టూడియోలో కాకుండా.. ముంబయి వెర్సోవాలోని 'మియా కుసినా' రెస్టారెంట్లో ఆ ఆడిషన్ జరిగింది. ఎప్పుడూ బిజీగా ఉండే ఆ రెస్టారెంట్‌లో కూర్చొని.. నా టేబుల్ చుట్టూ కస్టమర్లు భోజనం చేస్తున్నప్పుడు 'ఏడుస్తున్న సన్నివేశం'లో నటించాలని షానూ నాతో చెప్పింది' అంటూ ఇషా తల్వార్ 'ఇన్‌స్టా'లో రాసుకొచ్చింది. అంతేకాకుండా.. ఒక నటికి ఎటువంటి అభ్యంతరాలు ఉండకూడదనీ, అందుకే.. ఇలాంటి వాతావరణంలో నటించి చూపించాలని షానూ చెప్పిందట. 'ఆమె మాటలు నాకు గందరగోళంగా, వింతగా అనిపించాయి. ఒక సీనియర్ కాస్టింగ్ డైరెక్టర్.. ఒక కొత్త నటితో ఇలా ఎందుకు వ్యవహరించిందో నాకు అర్థం కాలేదు' అంటూ చెప్పుకొచ్చింది. కొత్తవారికి నిజమైన లొకేషన్‌లోనే ఆడిషన్ చేయాలనుకుంటే.. ఆ లొకేషన్‌ను సినిమా బృందం అధీనంలోకి తెచ్చుకోవాలనీ, చుట్టూ జూనియర్ ఆర్టిస్టులు, సినిమా క్రూ ఉండేలా చూసుకోవాలని అంటున్నది. అయితే, సినిమాకు సంబంధం లేనివాళ్ల మధ్య.. ఓ హోటల్‌లో ఆడిషన్ నిర్వహించడం వల్ల తన ఆత్మవిశ్వాసం

# సాయి దుర్గ తేజ్‌కు

## 'మోస్ట్ డిజైరబుల్ మేల్' అవార్డు



టాలీవుడ్ నటుడు సాయి దుర్గ తేజ్‌కు 'మోస్ట్ డిజైరబుల్ మేల్' అవార్డు లభించింది. శనివారం హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో జరిగిన యూజెనిక్స్ ఫిల్మ్‌ఫేర్ గ్లామర్ అండ్ స్టైల్ అవార్డ్స్ సౌత్ 2025 ప్రారంభోత్సవంలో సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్‌కు 'మోస్ట్ డిజైరబుల్ మేల్' అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో దక్షిణాది సినీ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వార్ 2: కియారా బికినీ సీన్‌ని తొలగించిన సెన్సార్ బోర్డు



అగ్రనటులు ఎన్.టి.ఆర్, హృతిక్ రోషన్ కలిసి నటించిన 'వార్ 2' సినిమా మరో నాలుగు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా సెన్సార్ పూర్తి చేసుకుంది ఈ చిత్రం. అయితే సినిమాకు U/A ' సర్టిఫికేట్ ఇచ్చే ముందు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (CBFC) చిత్రయూనిట్‌కి కొన్ని మార్పులను సూచించినట్లు సమాచారం. వాటిలో ముఖ్యంగా, హీరోయిన్ కియారా అద్వానీకి సంబంధించిన బికినీ సన్నివేశంలో 9 సెకన్ల విజువల్స్‌ను తొలగించాలని ఆదేశించినట్లు వార్తలు వస్తున్నాయి. 'ఆవన్ జావన్' అనే పాటలో కనిపించే ఈ బికినీ సీన్‌ను 50 శాతం మేర తొలగించాలని సెన్సార్ బోర్డు కోరినట్లు సమాచారం. దీనికి మేకర్స్ మొదట అంగీకరించకపోగా.. విడుదల తేదీ దగ్గరపడడంతో తగ్గినట్లు తెలుస్తుంది.

# ఎన్టీఆర్ అభిమానులకు గుడ్ న్యూస్

## 'వార్ 2' అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్



నందమూరి అభిమానులకు శుభవార్త. జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న వార్ 2 సినిమా మరో నాలుగు రోజుల్లో(ఆగస్టు 14న) ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. భారీ అంచనాల మధ్య రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి అడ్వాన్స్ బుకింగ్‌లు నేటినుంచి ప్రారంభమయ్యాయి. ప్రముఖ బుకింగ్ వెబ్‌సైట్స్ బుక్ మై షోలతో పాటు డిస్ట్రిక్ట్ యాప్‌లలో ఈ సినిమా టికెట్‌లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి.

## ఆంధ్రా కింగ్ తాలుకా సినిమా ఏమైంది..

# రామ్ ఇచ్చిన క్లారిటీ ఇదే..!



టాలీవుడ్‌లో యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరోగా పేరు సంపాదించుకున్న రామ్ పోతినేనికి అందం, అభినయం, మాస్ క్రేజ్ అన్నీ ఉన్నాయి. కానీ కథల ఎంపిక విషయంలో జరుగుతున్న పొరపాట్లు అతన్ని స్టార్ హీరోల జాబితాలోకి తీసుకెళ్లడంలో అడ్డుపడుతున్నాయి. టైర్-2 హీరోలలో టాప్ ప్లేస్ దక్కించుకునే అన్ని అర్హతలూ ఉన్నా, ఇప్పటికీ రామ్ ఆశించిన స్థాయికి చేరుకోలేకపోతున్నారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ తర్వాత రామ్ కు ఒక హిట్టు పడలేదు. ఆ సినిమా విజయం చూసి మాస్ బాట పట్టిన రామ్, అదే ట్రాక్‌లో వరుసగా ఫ్లాపులు చవిచూశారు. ఈ పరాజయాల వల్ల ఇప్పుడు మళ్లీ తన పాత స్టైల్‌కి, లవ్ స్టోరీల వైపు మళ్లారు. ప్రస్తుతం 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమాతో గుర్తింపు పొందిన దర్శకుడు మహేష్ బాబు పచ్చిగోల దర్శకత్వంలో ఓ రొమాంటిక్ ఎంటర్టైనర్‌లో నటిస్తున్నారు రామ్. ఈ సినిమా పేరు ఆంధ్రా కింగ్ తాలూకా. హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తుండగా, ప్రముఖ నటుడు ఉపేంద్ర కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా షూటింగ్ తుది దశలో ఉన్నా, మేకర్స్ నుంచి ఇప్పటివరకు రిలీజ్ డేట్ గురించి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో రామ్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో అప్డేట్స్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'పరదా' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి చీఫ్ గెస్ట్‌గా హాజరైన రామ్, అక్కడ అభిమానుల సందడి మధ్య స్టేజ్ మీద మాట్లాడారు.

ఈలలు, అరుపులు పెడుతూ ఫ్యాన్స్ హడావిడి చేయడంతో, "ఇది మన సినిమా ఈవెంట్ కాదు, మన సినిమా ఈవెంట్‌లో మాట్లాడుకుందాం" అంటూ వారిని సున్నితంగా కూల్ చేశారు. అయితే ఆ ఈవెంట్‌లో యాంకర్ నుంచి వచ్చిన ప్రశ్న.."ఆంధ్రా కింగ్ తాలూకా అప్డేట్ ఎప్పుడొస్తుంది?" అన్నదానికి, రామ్ సీరియస్‌గా స్పందిస్తూ, "పరదా సినిమా విడుదలకి ముందే (ఆగస్టు 22కి ముందు) మా సినిమా నుంచి అప్డేట్ ఇస్తాం" అని ప్రకటించారు. దీంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అయ్యారు.

# ఎల్లంపేట గ్రామంలో ఘనంగా బోనాల ఉత్సవాలు



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపేట గ్రామంలో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని దుర్గమ్మ,పోచమ్మ,ఎల్లమ్మ ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలు,పూలతో సుందరంగా అలంకరించారు. మహిళలు,భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవార్లకు బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం ఫలహారం బండి ఊరేగింపులను బ్యాండ్ చప్పట్లు,డీజే పాటలు, పోతురాజుల విన్యాసాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు.

# మేడ్చల్‌లో నేడు హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ పట్టణంలో నిర్వహించే హర్ ఘర్ తిరంగా ర్యాలీని జయప్రదం చేయాలని భారతీయ జనతా పార్టీ మున్సిపల్ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ పిలుపునిచ్చారు. జాతీయ జెండా ప్రాముఖ్యతను చాటి చెప్పే లక్ష్యంతో చేపట్టే ఈ ర్యాలీ ఈనెల 11న ( సోమవారం) ఉదయం 9 గంటలకు మేడ్చల్ బాలుర ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రారంభమవుతుందని ఆమె తెలిపారు. ఈ ర్యాలీలో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని దేశభక్తిని చాటుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జరిగిన మున్సిపల్ కమిటీ సమావేశంలో, శైలజ హరినాథ్ ర్యాలీ నిర్వహణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యులు రాగం అర్జున్, ప్రధాన కార్యదర్శులు జాకట ప్రేమ్ దాస్, వంశీ విజయ్, సీనియర్ నాయకులు మైసరి రాజు, యువ మోర్చా జిల్లా నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి, వేలూరి సంతోష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు హేమలత రెడ్డి, ఇతర మున్సిపల్ నాయకులైన మహేష్ గౌలికర్, వంశీధర్ రెడ్డి, నర్సింగ్ రావు, దొంతరబోయిన సాయికుమార్, అనిత, శోభారాణి నరేందర్, కేశవరెడ్డి, పవన్, వెంకటేష్, పురుషోత్తం, జాకట బాబు రాజు, భారత్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానం - గోశాల సంరక్షణకు భక్తుల ఉదారత

**- వేములవాడ దేవస్థానానికి భక్తుల రూ. 2 లక్షల విరాళాలు**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలోని సేవా కార్యక్రమాలకు భక్తులు లక్షల్లో విరాళాలు అందించి, వారి ఉదారతను చాటుకున్నారు.

### రాజన్న నిత్యాన్నదాన సేవలకు

హైదరాబాద్ ఐటీ ఉద్యోగి కట్టంగూర్ రాజ వంశీధర్ రెడ్డి, తన కుటుంబ సభ్యులు అందె మహిత రెడ్డి, రాజసుద్రవ్ రెడ్డి, శ్రీ రీధి రెడ్డి కలిసి రాజరాజేశ్వర నిత్యాన్నదాన చారిటబుల్ ట్రస్ట్‌కు రూ. 1లక్ష విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని దేవస్థాన సహాయ కార్యనిర్వహణాధికారి జి. అశోక్ కుమార్ స్వీకరించారు. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్, డొనేషన్ కౌంటర్ క్లర్క్ రుద్ర సమీర పాల్గొన్నారు.

### గోశాల సంరక్షణకు

సిద్ధిపేటకు చెందిన భక్తుడు వంగ రాజేశ్వర్ రెడ్డి తన కుమార్తె ఆర్తి రెడ్డి పేరుతో గోశాల సంరక్షణ ట్రస్ట్‌కు రూ. 1 లక్ష విరాళం అందజేశారు. దేవస్థాన ప్రోటోకాల్ పర్యవేక్షకుడు శ్రీకాంత్ చారి విరాళాన్ని స్వీకరించగా, కె. సింహాచార్యులు, బి. రమాదేవి పాల్గొన్నారు.దేవస్థాన సిబ్బంది ఈ విరాళాలు సేవా కార్యక్రమాల విస్తరణకు ఉపయోగపడతాయని పేర్కొంటూ, భక్తుల కుటుంబాలకు రాజన్న ఆశీస్సులు కలగాలని ఆకాంక్షించారు.

# పుంజాల శివశంకర్ సమజాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయం

**- జిల్లా మున్నూరుకాపు కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ : కూరగాయల కొమురయ్య**

**- వేములవాడలో ఘనంగా పుంజాల శివశంకర్ జయంతి వేడుకలు**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ మున్నూరు కాపు సత్రంలో కేంద్ర మాజీ మంత్రి, దివంగత పుంజాల శివశంకర్ జయంతి వేడుకలను ఆదివారం మున్నూరు కాపు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శివశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, వారి సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జిల్లా మున్నూరుకాపు కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కూరగాయల కొమురయ్య మాట్లాడుతూ పుంజాల శివశంకర్ మున్నూరు కాపు సమాజ అభ్యున్నతికి, పేదల సంక్షేమానికి, విద్యా అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొంచేట్టి శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు నామాల పోశెట్టి,మాజీ కౌన్సిలర్ మారం కుమార్,వేములవాడ పట్టణ అధ్యక్షుడు ఇప్పపూల అజయ్,పట్టణ ప్రధాన కార్యదర్శి బొందిల మహేష్, కొండ శేఖర్,ప్యాక్స్ డైరెక్టర్ తోటరాజు, బొందిల శ్రీనివాస్, సగ్గు దేవరాజు,మిట్ట రాజయ్య,అన్నం ప్రసాద్, నాయిని శ్రీనివాస్, కూరగాయల రాజు,తిరుపతి, జగన్‌తో పాటు మున్నూరు కాపు కుల బాంధవులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆశీస్సులతో ప్రజా సేవలో ముందుకెళ్తా

**- ప్రజా సేవే నా ధ్యేయం - ఏఎంసీ చైర్మన్ : బోయిని ఎల్లేష్ యాదవ్**

**- కాంగ్రెస్ మండల శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా బోయిని ఎల్లేష్ యాదవ్ జన్మదిన వేడుకలు**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలో ఆదివారం బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల శ్రేణుల ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేయించి, మిఠాయిలు పంచి, శాలువాలతో ఘనంగా సన్మానించి, నిత్యం ప్రజా సేవలో నిమగ్నమవుతూ బోయినిపల్లి మండల అభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎల్లేష్ యాదవ్ మాట్లాడుతూ – "ప్రజల ఆశీర్వాదం, ప్రేమతోనే ఈ స్థాయికి చేరుకున్నాను. బోయినిపల్లి మండల అభివృద్ధి,రైతుల సంక్షేమం, ప్రజల సమస్యల పరిష్కారమే నా ధ్యేయం.ఈ ప్రయాణంలో ఎల్లప్పుడూ ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఆయన చూపిస్తున్న అభివృద్ధి దిశలోనే నేను సైతం మండల అభివృద్ధి కోసం కృషి చేస్తాను. కాంగ్రెస్ పార్టీ ఆశయాలను కాపాడుతూ,నిత్యం ప్రజా సేవలో నిమగ్నమై ఉంటాను. నాకు అందించిన ఈ సత్కారం, శుభాకాంక్షలు నన్ను మరింత కృషి



చేయడానికి ప్రేరేపిస్తున్నాయి" అని,నా జన్మదిన వేడుకల్లో భాగస్వామ్యులైన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లాధ్యక్షులు కూస రవీందర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లాధ్యక్షులు డాక్టర్ కౌడగాని వెంకటేష్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి,నాయకులు మహమ్మద్ హుస్సేన్, కొలుపుల ప్రవీణ్,పిట్టల రమేష్,ధ్యావ మహిపాల్ రెడ్డి,నల్ల మోహన్,తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చల్మెడ పరామర్శ



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,చందుర్తి మండల కేంద్రానికి చెందిన ధీకొండ తిరుపతిరావు కుమారుడు ధీకొండ రాజు ఇటీవల క్వారీలో జరిగిన ప్రమాదం లో మృతి చెందగా, అలాగే మూడపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త కట్కూరి ఎలియా తండ్రి కట్కూరి దేవయ్య అనారోగ్యంతో మృతిచెందగా ఆదివారం వారి కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి, ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య,సీనియర్ నాయకులు చిలుక పెంటయ్య, సంటి బాపురావు,చిలుక అంజిబాబు,ఏనుగుల శ్రీనివాస్,దుమ్మ అంజయ్య, మరాఠీ మల్లిక్, బద్ధం బాపు రెడ్డి,పోతరాజు నగేష్,గంద్ర లక్ష్మణ్ రావు,గొల్లం రాజు, ఎండి సమీర్,అజయ్,ప్రభాకర్ రావు,తదితరులు ఉన్నారు.

# గురువుల సంక్షేమమే 'గురుదక్షిణ' లక్ష్యం

**- విజయ్ కుమార్ నారమల్ల గురుదక్షిణ అధ్యక్షుడు**

**- గురువుల కోసమే గురుదక్షిణ**

**- మీ సమస్యలను ప్రశ్నిస్తాం అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం**

**- మి కోసమే మేము త్వరలో ఉమ్మడి కరీంనగర్, అదిలాబాద్‌లలో గురుదక్షిణ అధ్యక్షులు**



**పెద్దపల్లి ( ప్రశ్న న్యూస్)** గురువుల సంరక్షణ కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేయబడిన సంస్థ "గురుదక్షిణ". ఈ సంస్థ గురువుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారికి న్యాయం జరిగేలా పోరాడాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. గురుదక్షిణ అధ్యక్షుడు నారమల్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక కష్టాలను పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల శ్రమ దోపిడీ, తక్కువ వేతనాలు, ఎక్కువ పని గంటలు వంటి సమస్యలు సర్వసాధారణంగా మారాయి. కొంతమంది యాజమాన్యాలు ఉపాధ్యాయులను కనీస వేతనాలు కూడా ఇవ్వకుండా, వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దీనికితోడు, కొన్నిచోట్ల యాజమాన్యాలు, తోటి ఉద్యోగుల నుండి మహిళా ఉపాధ్యాయులకు లైంగిక వేధింపులు కూడా ఎదురవుతున్నాయని గురుదక్షిణ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్ది పద్మ పేర్కొన్నారు. ఇలాంటి సమస్యలను పరిష్కరించడానికి తాము షీ టీమ్స్‌తో కలిసి పనిచేస్తామని ఆమె హామీ ఇచ్చారు.గురుదక్షిణ కమిటీకి వచ్చే ఫిర్యాదుల వివరాలను గోప్యంగా ఉంచి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని విజయ్ కుమార్ నారమల్ల తెలిపారు. విద్యాసంస్థల యాజమాన్యాలు స్పందించని పక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. గురువులు ఆత్మగౌరవాన్ని చంపుకుని దిక్కులేని స్థితిలో ఉద్యోగాలు చేయాల్సిన అవసరం లేదని, వారి సమస్యలను పరిష్కరించడానికి గురుదక్షిణ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.త్వరలో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో గురుదక్షిణ కార్యాలయాలు ఏర్పాటు చేసి, మరింత విస్తృతంగా పనిచేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువుల సంక్షేమం, భద్రత, వారి హక్కుల పరిరక్షణే గురుదక్షిణ ముఖ్య లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన చల్మెడ



**కోనరావుపేట (ప్రశ్న న్యూస్)** వేములవాడ నియోజకవర్గం, కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ చిట్నేని శ్రీనివాసరావు–శారద దంపతుల కూతురు కీర్తి వివాహం రోహిత్ రావుతో ఆదివారం సిరిసిల్లలోని పద్మనాయక కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు.వారి వెంట సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్ రావు,మాజీ ఎంపీపీ చంద్రయ్య గౌడ్,నాయకులు శివతేజ, రత్నాకర్ తదితరులు ఉన్నారు.

# పెద్దపెల్లి జిల్లాలో ఐదవ డి జెఎఫ్ మహాసభలో ప్రసంగించిన మంత్రి

**- పత్రికా విలువలను పెంచుతూ సమాజాభివృద్ధికి జర్నలిస్టుల కృషి.**

**- ప్రభుత్వానికి, ప్రజలకు సంధానకర్తలుగా వ్యవహరిస్తున్న జర్నలిస్టులు.**

**- ఐటీ మంత్రి శ్రీధర్ బాబు**



**పెద్దపల్లి (ప్రశ్న న్యూస్)** నేటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా దేశ, రాష్ట్ర అభివృద్ధికి పాత్రికేయుల పాత్ర చెప్పనలవి కానిది. ప్రజల పట్ల, ప్రభుత్వం పట్ల రాగదేశాలకు పోకుండా నిష్పక్షికంగా ప్రజలకు అండదండల అందించే వృత్తి జర్నలిజం. నేటి సమకాలిక అంశాలలో పత్రికా విలేకరుల వృత్తి కత్తి మీద సాము లాంటిది. రాష్ట్ర భవిష్యత్తుకు పాత్రికేయులు దశ దిశ నిర్దేశించి ప్రజల మందలను పొందడానికి కృషిచేసి చరిత్ర పుటలలో నిలిచిపోవాలని సూచించారు. పత్రికలకు దైనందిన జీవితంలో ప్రభుత్వానికి, ప్రజలకు రాష్ట్ర పురోభివృద్ధిలో భాగంగా విలేకరులు పనిచేసి రాజకీయ నాయకుల పట్ల తగిన సలహాలు, సూచనలు ఇచ్చి ప్రభుత్వాన్ని మేల్కొల్పే విధంగా వార్తలను సంధించే అవసరము ఎంతైనా ఉన్నది విలేకరుల పైన. ఈ మహాసభలో విలేకరులు సత్ప్రవర్తనతో మానవ విలువలను పునికి పుచ్చుకొని ప్రభుత్వాలకు ప్రజలకు ఆదర్శంగా నిలిచి చరిత్రలో విలేకరులు నిలిచిపోవాలని పెద్దపల్లి జరిగిన ఐదవ డి జే ఎఫ్ మహాసభలలో మానసాని కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు .

# అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు

**- బోయినిపల్లి ఎస్సై : రాజా కుమార్**

**- అక్రమ ఇసుక రవాణా - ట్రాక్టర్ పట్టివేత,ఇద్దరు రిమాండ్**




**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, నర్సింగాపూర్ గ్రామ అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆదివారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో బోయినిపల్లి పోలీసులు అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్నారు. టీఎస్-02-యూఏ-9573 ట్రాక్టర్,వైఎస్-02-యుడి-0040 నెంబరు గల ట్రాక్టర్ ట్రాలీలో ఇసుకను లోడ్ చేసి తరలిస్తున్న డ్రైవర్ వల్లపూల సాయికుమార్ (21, కొత్తపల్లి మండలం)ను, యజమాని పెరుమాండ్ల అజయ్ (27)ను అదుపులోకి తీసుకున్నారు.ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు బోయినిపల్లి ఎస్ఐ రాజా కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా అక్రమ రవాణాపై హెచ్చరిస్తూ ఎస్ఐ మాట్లాడుతూ %-% "బోయినిపల్లి మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణా చేసే వారిని ఎవ్వరినీ వదిలిపెట్టము. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాము. ప్రజలు కూడా ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు సహకరించవద్దు" అని స్పష్టం చేశారు.

# పేద ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇల్లు

**- ప్రభుత్వ విప్: ఆది శ్రీనివాస్**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** పేదలకు గూడు కల్పించే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం పేద ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వేములవాడ రూరల్ మండలం,చెక్కపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి పనుల పురోగతి, అవసరాలు తెలుసుకున్నారు.ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు నిర్మాణం చేస్తున్నామని, ఇప్పటికే బేస్‌మెంట్ పనులు పూర్తై వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గత పది సంవత్సరాల పాలనలో ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. పేదలకు గూడు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

### లబ్ధిదారుల ఆనందం

"గతంలో ఇందిరమ్మ హయాంలో మా చిన్న కొడుకుకు ఇల్లు వచ్చింది. ఇప్పుడు పెద్ద కొడుకుకి కూడా మంజూరైంది. సొంత ఇల్లు కలగడం ఎంతో ఆనందంగా ఉంది" అని లబ్ధిదారులు చెప్పారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం నిజంగా పేదల పక్షాన నిలుస్తోందని వారు అభిప్రాయపడ్డారు.

### వార్డులో పేదలకు హామీ

వేములవాడ పట్టణ 17వ వార్డులో పల్లపు శారద గుడిసెను పరిశీలించిన విప్, వారంరోజుల్లో రేషన్ కార్డు ఇప్పించి,త్వరలో ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

# దూకుడు పెంచిన రామచంద్రరావు

## - మరో బండి సంజయ్ అవుతారా.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బండి సంజయ్ భారతీయ జనతా పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పార్టీ వ్యవహారాలు జోరుగా సాగేవి. అప్పట్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా తెలంగాణకు అనేక పర్యాయాలు వచ్చారు, తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే అన్నట్టుగా సంకేతాలు ఇచ్చారు. సంజయ్ కూడా పార్టీ కార్యకలాపాలను ఉధృతంగా సాగించేవారు. భారత రాష్ట్ర సమితి పరిపాలన కాలంలో బండి సంజయ్ రెండు పర్యాయాలు పోలీసుల చేతిలో అరెస్టు అయ్యారు. బండి సంజయ్ నాయకత్వంలోనే భారతీయ జనతా పార్టీ దుబ్బాక ఉప ఎన్నికల్లో విజయం సాధించింది. గ్రేట్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితికి తిరుగులేని పోటీ ఇచ్చింది. మునుగోడు ఉప ఎన్నికల్లోనూ రెండవ స్థానంలో నిలిచింది. హుజరాబాద్ ఉప ఎన్నికల్లోనూ విజయం సాధించింది. ఒకరకంగా బండి సంజయ్ భారతీయ జనతా పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో జవసత్వాలు కల్పించారని చెప్పుకోవచ్చు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధినాయకత్వం ఒకసారి గా బండి సంజయ్ ని తప్పించింది. ఆయన స్థానంలో కిషన్ రెడ్డి నియమించింది. ఆయినప్పటికీ భారతీయ జనతా పార్టీ 2018 ఎన్నికల తో పోల్చుకుంటే 2023లో గణనీయమైన ఫలితాలను సాధించింది. పార్లమెంటు ఎన్నికల్లో ఏకంగా 8 స్థానాలను సొంతం చేసుకుంది. అయితే బండి సంజయ్ కనుక తెలంగాణ రాష్ట్రానికి అధ్యక్షుడిగా ఉంటే పార్లమెంటు స్థానాలు మరిన్ని పెరిగేవని రాజకీయ విశ్లేషకులు అంటుంటారు. భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకత్వం ఎందువల్ల బండి సంజయ్ ని మార్చాల్సివచ్చిందో ఇప్పటికీ క్లారిటీ లేదు. బండి సంజయ్ కి కేంద్ర మంత్రి పదవి ఇచ్చినప్పటికీ ఇప్పటికీ కార్యకర్తల్లో సంజయ్ లేని లోటు కనిపిస్తూనే ఉంది. ఇటీవల రామచంద్రరావు భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్రానికి అధ్యక్షుడిగా నియమించింది. ఆయనకు అధ్యక్ష పదవిని ఇవ్వడాన్ని పార్టీలో కొంతమంది నాయకులు జీర్ణించుకోలేకపోయారు. నేరుగా తమ నిరసన వ్యక్తం చేశారు. అయినప్పటికీ బీజేపీ కేంద్ర నాయకత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోలేదు. అయితే ఇప్పుడు ఆపరేషన్ ఆకర్ష్ కు పార్టీ కేంద్ర నాయకత్వం తెరలేపినట్టు కనిపిస్తోంది. అందువల్లే భారత రాష్ట్రసమితికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు కాషాయ కండువా కప్పుకుంటున్నారు. ఇప్పటికే అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిజెపిలో చేరారు. ఇంకా కొంతమంది మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు లైన్లో ఉన్నారని రామచంద్రరావు అంటున్నారు. ఒకవేళ గనుక ఇదే స్థాయిలో చేరికలు గనుక కొనసాగితే బీజేపీ 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి బలపడుతుందని కాషాయ పార్టీ కార్యకర్తలు భావిస్తున్నారు రామచంద్ర రావు బండి సంజయ్ మాదిరిగానే పార్టీలో దూకుడు పెంచడానికి ప్రయత్నిస్తున్నారని వారు చర్చించుకుంటున్నారు, ఒకవేళ రామచంద్రరావు సంజయ్ మాదిరిగానే జోరు కొనసాగిస్తే మాత్రం బీజేపీకి తిరుగు ఉండదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# నన్ను కాపాడండి : నరసింహ

- రెక్కల కష్టాన్ని నమ్ముకున్న వ్యక్తి దిక్కుతోచని స్థితిలో
- రెక్కాడితే గాని డొక్కాడని వ్యక్తి ప్రాణాల కోసం పోరాటం
- సహాయం కోసం ఎదురుచూపులు



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) రెక్కాడితే గాని డొక్కాడని జీవితానికి పెద్ద కష్టం వచ్చి పడింది. తన కష్టంతో కుటుంబాన్ని పోషిస్తున్న ఇంటి పెద్దకు మహా విపత్తే తాకింది. మాయదారి ప్రస్తుత సమాజంలో వింత వింత రోగాలు పొంచి ఉండగా, ఒక్క చిన్న చితుకు ప్రాణాలను గాల్లో కలిపేస్తున్నాయి. ఇప్పుడు అలాంటి అరుదైన, ప్రాణాంతక వ్యాధి 37 ఏళ్ల నర్సింహని పట్టిపీడిస్తోంది. కాస్రోసివ్ ఎసోఫాగియల్ స్ట్రిక్చర్ అనే క్లిష్టమైన వ్యాధి బారిన పడి, ఇప్పటివరకు పలు శస్త్రచికిత్సలు ఎదుర్కొన్న నర్సింహ, తాజాగా నిమ్స్‌లో చేసిన ఎండోస్కోపి పరీక్షలో ఈసోఫాగస్‌లో ల్యూమినల్ నారోయింగ్ ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. తినే ఆహారం సులభంగా దిగకపోవడం వల్ల బలహీనత రోజురోజుకు పెరుగుతోంది. ఈసోఫాగోప్లాస్టీ, కోలోజెజునల్, జెజె ట్రాన్స్‌వర్స్ అనాస్టమోసిస్ వంటి క్లిష్ట ఆపరేషన్లు ఇప్పటికే పూర్తయ్యాయి. కానీ ఇంకా క్రమం తప్పకుండా చికిత్స అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. అయితే, ఈ చికిత్స ఖర్చులు ఆ కుటుంబ ఆర్థిక స్తోమతకు మించినవిగా మారడంతో వారు విలవిలలాడుతున్నారు. శస్త్ర చికిత్సలే కాకుండా మందులు కూడా ఖరీదైనవి కావడంతో ఆ కుటుంబం ఏమి చేయలేని పరిస్తితులలో దైవం మీద భారం వేసి దాతలుముందుకు రావాలని వేడుకుంటున్నారు. నర్సింహ స్వయం ఉపాధితో హైదరాబాద్ లో జీవనం కొనసాగిస్తూ ఉండే వాడు. వయస్సు చిన్నది కావడం అతనికి ఇద్దరు పిల్లలు చిన్నవారు కావడంతో. తనకు జరుగరనిదేమైన అయితే భార్యాపిల్లలు దిక్కుతోచనివారవుతారని కన్నీటిపర్యంతరమయ్యారు. ఆయన మాట్లాడుతూ“ నా ఆరోగ్యం కోసం మాత్రమే కాదు, నా ప్రాణం కోసం పోరాడుతున్నాను. మీ చిన్న సహాయం నా జీవితం నిలబెట్టగలదు. ఒక్కరోజులో ఎంతో ఖర్చు పెడుతారు నాకోసం ఎంతో కొంత ఆర్థిక సాయాన్ని చేస్తే నన్ను నా కుటుంబాన్ని కాపాడిన వారవుతారు “ అని నర్సింహ కన్నీటితో దాతలను వేడుకుంటున్నారు. సహాయం అందించదలచిన వారు UPI ID crazyadds805-1@oksbi ద్వారా లేదా ఫోన్ 8886022290 ద్వారా సహాయం చేయగలరు

# ఆరంఘర్ చౌరస్తా సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్ కష్టాలు

- 120 సెకండ్స్ సిగ్నల్స్ తో అష్ట కష్టాలు పడుతున్న వాహనదారులు
- ఆటు మన్మోహన్ సింగ్ ఫ్లైఓవర్ వరకు ఇటు పివిఆర్ ఎక్స్ప్రెస్ రే వరకు వాహనాల రద్దీ
- సిగ్నల్ టైం ఎక్కువగా ఉండడం తో భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్
- నాలుగు మార్గలు ఉన్నా అటు జూపార్క్ నుంచి ఇటు శంషాబా ద్ నుంచివచ్చే వాహనాలతో నిత్యం ట్రాఫిక్
- రెండు ఫ్లైఓవర్లు ఉన్నా సిగ్నల్స్ వద్ద తప్పని అవస్థలు
- వాహనాల రద్దీ విషయంలో ట్రాఫిక్ పోలీసులు దృష్టి పెట్టాల్సిందే



రాజేంద్రనగర్(ప్రశ్న న్యూస్) అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది రాజేంద్రనగర్ చౌరస్తాలోని సిగ్నల్ ల పరిస్థితి, రాజేంద్రనగర్ ఆరంగర్ చౌరస్తా వద్ద సిగ్నల్స్ తో కేవలం జాతీయ రహదారిపైనే వాహనాలు భారీగా నిలిచిపోతున్నాయి, జాతీయ రహదారిపై నిత్యం పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఇటీవలే జూ పార్క్ నుంచి ఆరంగర్ వరకు జాతి రహదారిపై మన్మోహన్ సింగ్ ఫ్లై ఓవర్ ని ఏర్పాటు చేశారు. విమానాశ్రయం ఏర్పాటయిన తర్వాత ఆరంగర్ చౌరస్తా నుంచి సిటీలోని మేదిపట్నం సరోజినీ దేవి కంటి ఆసుపత్రి వరకు గతంలోని భారత దేశంలోనే అతి పొడవైన అతి అతి ఎత్తైన పీవీ నరసింహారావు ఎక్స్ప్రెస్ వే ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టిన విషయం విధితమే అయితే ఆరంగరి చౌరస్తా పెద్ద జంక్షన్ గా ఉండడంతో ఆరంగర్ చౌరస్తా నుంచి మేదిపట్నం రూట్ వెళ్లే వాహనాలు ఓవైపు కాటేదాన్ చంద్రన్న గుట్ట వెళ్లే వాహనాలు మరోవైపు ఎయిర్పోర్టు కోసం వాహనాలు పీవీ ఎక్స్ప్రెస్ వే నుంచి వెళుతున్న విషయం విధితమే . అయితే జూ పార్క్ నుంచి వచ్చే వాహనాలు మన్మోహన్ సింగ్ ఫ్లైఓవర్ నుంచి వచ్చి ఆరంగడు చౌరస్తా వద్ద భారీ ఎత్తున నిలిచిపోతున్నాయి, అదేవిధంగా శంషాబాద్ జాతీయ రహదారి నుంచి వచ్చేటువంటి వాహనాలు జూ పార్క్ అఫ్జల్గంజ్ వెళ్ళాలంటే చౌరస్తా సిగ్నల్స్ వద్ద భారీగా నిలిచిపోతున్నాయి. ఫ్లై ఓవర్ల నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వచ్చిన వాహనదారుడు ఆరంగర్ చౌరస్తా వద్ద 120 సెకండ్ల వరకు వాహనాలు నిలిచిపోతుండడంతో భారీ ట్రాఫిక్ ఏర్పడుతుంది. జూ పార్క్ నుంచి వచ్చే వాహనాలు సిగ్నల్స్ తో మన్మోహన్ సింగ్ ఫ్లైఓవర్ మీద వరకు నిలిచిపోతుండడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఆరంగర్ జంక్షన్ వద్ద 120 సెకండ్లు సిగ్నల్ పడుతుండడంతోనే అవస్థలు

జాతీయ రహదారి నుంచి శంషాబాద్ విందూరు వెళ్లే వాహనాలు ఆరంగర్ చౌరస్తా వద్ద సిగ్నల్స్ 120 సెకండ్లు పడుతుండడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది, దీంతో కిలోమీటర్ల మేర ఎలాంటి ఇబ్బంది లేకుండా వచ్చిన వాహనదారుడు సిగ్నల్స్ వద్ద 120 సెకండ్లు నిలుస్తుండడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. శంషాబాద్ నుంచి అఫ్జల్గంజ్ వైపు వచ్చే వాహనదారుడు కూడా సిగ్నల్స్ తో బాంబేలు ఎత్తుతున్నారు. ఈ జంక్షన్ వద్ద అటు మెదీపట్నం వెళ్లడానికి ఇటు చంద్రాయనకు వెళ్లడానికి వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు పడలేకపోయినా జాతీయ రహదారి నుంచి రెండు వైపు వెళ్లే వాహనదారులకు మాత్రం అవస్థలు తప్పడం లేదు .

### సిగ్నల్ వద్ద ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఇబ్బందులు

ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ 120 సెకండ్లు సిగ్నల్ పడుతుండడంతో ఇరువైపుల వచ్చే వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జూ పార్క్ నుంచి వచ్చే వాహనదారులు ఎయిర్ పోర్ట్ ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే 120 సెకండ్లు నిల్వక తప్పడం లేదని వాపోతున్నారు. ఇతర పనులు మీద హైదరాబాద్ కు వెళ్లే వచ్చే వాహనదారులు ఇంతే టైం ఉండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా 120 సెకండ్లు వాహనాలు నిలిచిపోవడం దారుణంగా ఉందని




వాహనదారులు వాపోతున్నారు. రెండు ఫ్లైఓవర్లు ఏర్పాటు చేసినప్పటికీ గమ్యస్థానం చేరుకోవడానికి కేవలం అరంగర్ చౌరస్తాల్ని నిలిచిపోవడం జరుగుతుందని దీంతో ఇబ్బందులు అవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామ్ భారీగా ఏర్పడుతుందని ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ఆరంగార్ చౌరస్తాలో జాతీయ రహదారి నుంచి వెళ్లే వాహనాలకి సిగ్నల్ టైం కుదించాలని కోరుతున్నారు.

### అరంగర్ చౌరస్తా వద్ద అండర్ గ్రౌండ్ మార్గం

ఆరంగర్ జంక్షన్ వద్ద అటు మెహిదీపట్నం ఇటు చాంద్రాయణ గుట్ట వెళ్లే వాహనదారులకు అండర్ గ్రౌండ్ మార్గం ఉన్నప్పటికీ పైన సిగ్నల్స్ వద్ద కూడా ఏమాత్రం ఆలస్యం లేకుండా ఈ రెండు మార్గాలకు వాహనాలు వెళుతున్నాయి. ఎటోచ్చి జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలు మాత్రమే భారీ ఎత్తున నిలిచిపోతుండడం ఆందోళన కలిగించే విషయం హైదరాబాద్ కు వచ్చే వాహనాలు పీవి ఎక్స్ ప్రెస్ వే వరకు నిలిచిపోతుండడం, అదేవిధంగా జూపార్క్ నుంచి వచ్చే వాహనాలు అరంగర్ చౌరస్తా వద్ద మన్మోహన్ సింగ్ ఫ్లైఓవర్ పై వరకు నిలిచిపోతుండడం ఆందోళన కలిగించే విషయం ఇప్పటికైనా అధికారులు వెంటనే జాతీయ రహదారుల నుంచి వెళ్లే వాహనాలకి అరంగర్ చౌరస్తా వద్ద ఉన్న సిగ్నల్ ను 120 నుంచి కుదించాలని కోరుతున్నారు.(




Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588